




సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778








రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 215 పేజిలు : 12, వెల రూ. 5/- ఆదివారం, సెప్టెంబరు 27, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA


# మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి: సీఎం రేవంత్

హైదరాబాద్‌లో మాజీ ప్రధాని విగ్రహావిష్కరణ

ఆర్థిక సంస్కరణలతో దేశానికి కొత్త దిశ

తెలంగాణ ఏర్పాటు నిర్ణయంలో కీలక పాత్ర

మన్మోహన్‌సింగ్ పేరిట విజ్ఞానకేంద్రం ఏర్పాటు చేయాలి

భవిష్యత్ తరాలకు ఆయన సేవలు తెలియాలి

రాజకీయాలకు అతీతంగా దేశ సేవకులను గౌరవించాలి



హైదరాబాద్, సెప్టెంబర్ 26: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయాలకు అతీతంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, దేశానికి విశేష సేవలు చేసిన నేతలను గౌరవించే విషయంలో రాజకీయాలను పరిగణనలోకి తీసుకోకూడదని అన్నారు. మన్మోహన్‌సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహాన్ని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థలో మన్మోహన్‌సింగ్ కీలక పాత్ర

(మిగతా 2వ పేజీలో)



# డల్లాస్‌లో మల్‌రెడ్డి రాంరెడ్డికి ఘన స్వాగతం

కాంగ్రెస్ బలోపేతానికి ఎన్ఆర్ఐ కాంగ్రెస్ ప్రతినిధుల కృషి అభినందనీయం



డల్లాస్:అరుణ ప్రభ, సెప్టెంబర్ 26.అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి డల్లాస్‌లో ఎన్ఆర్ఐ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వంగేటి రణధీర్ రెడ్డి, సంరెడ్డి దినకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి 100 మందికి పైగా ఎన్ఆర్ఐ కాంగ్రెస్ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి ఎన్ఆర్ఐ కాంగ్రెస్ ప్రతినిధులతో సమావేశమై తెలంగాణ రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అమెరికాలో ఉంటూనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రవాస కాంగ్రెస్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ప్రజా పాలన కొనసాగుతోందని మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఎన్ఆర్ఐ కాంగ్రెస్ ప్రతినిధులను కోరారు. తెలంగాణలోని తమ బంధువులు, మిత్రులు, పరిచయస్తులతో మాట్లాడి ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం కావడానికి ప్రవాస భారతీయులు సహకరించాలని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్, వరంగల్–ఖమ్మం–నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల నమోదు ప్రక్రియపై కూడా ఈ సందర్భంగా చర్చ జరిగింది. ఎన్ఆర్ఐ కాంగ్రెస్ ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమ సహకారం కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, సంస్థాగత బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రమోద్ రెడ్డి, గోవింద్ రెడ్డి, వసంత్ రెడ్డి, సందీప్, యూనస్ ఖాన్, నెహ్రూ కొమ్మినేని, సంతోష్ కొమ్మిడి, అచ్యుత్ తుమ్మల, శ్రీధర్ వేముల, రఘువీర్ బండారు, జగన్మోహన్ తదితర ఎన్ఆర్ఐ కాంగ్రెస్ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణలో టెట్ ఫలితాలు విడుదల..

# 70.07 శాతం ఉత్తీర్ణత

టీజీటెట్ ఇన్-సర్వీస్-2026 ఫలితాలు విడుదల

22,477 మందిలో 15,749 మంది అర్హత

పేపర్-1లో 68.76% మంది పాస్

గణితం, సైన్స్‌లో 73.60 శాతం ఉత్తీర్ణత

సోషల్ స్టడీస్‌లో 67 శాతం మంది అర్హత



## తెలంగాణలో 200 కొత్త జూనియర్ సివిల్ కోర్టులు..

# కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం

తెలంగాణలో 200 కొత్త జూనియర్ సివిల్ కోర్టుల ఏర్పాటుకు ఆమోదం

తొలి దశలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ

కేసుల భారం తగ్గించి, సత్వర న్యాయం అందించడమే లక్ష్యం

అత్యధికంగా హైదరాబాద్ మెట్రో పరిధిలోనే 71 కోర్టుల కేటాయింపు



# ఖైరతాబాద్ లో పోటీ చేస్తాం..

## నా ఫాంహౌస్ కబ్జా భూమి కాదు: కవిత

ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని దింపుతామన్న కవిత

రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని విమర్శ

తన ఆస్తులకు సంబంధించిన ప్రతి వివరం అఫిడవిట్లో క్లియర్‌గా ఉందని వెల్లడి





# భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

## అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష

వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం

గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో

(మిగతా 2వ పేజీలో)

# వచ్చే వర్షాకాలానికి కాళేశ్వరం బ్యారేజీల్లో నీటి నిల్వ

నవంబర్ రెండో వారంలో పునరుద్ధరణ పనులకు శ్రీకారం

2027 వర్షాకాలానికి ముందే 3 బ్యారేజీల పనులు పూర్తి

అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ కమిటీ ముందుకు తుది డిజైన్లు

ఎన్‌డీఎస్‌ఏ, జాతీయ సాంకేతిక సంస్థల సూచనల మేరకు పనులు

పునరుద్ధరణ అనంతరం భద్రతా ధ్రువీకరణతో నీటి నిల్వపై నిర్ణయం

భద్రత, నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, సెప్టెంబర్ 26: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభించి, 2027 వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పునరుద్ధరణ పనులు పూర్తయిన తర్వాత జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల నుంచి అవసరమైన భద్రతా ధ్రువీకరణ పొందిన అనంతరం వచ్చే వర్షాకాలంలో బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసే అంశంపై నిర్ణయం తీసుకుంటామని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బేగంపేట కుందన్‌బాగ్‌లోని తన అధికారిక క్యాంపు కార్యాలయంలో శనివారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణపై సమీక్ష నిర్వహించారు. మూడు బ్యారేజీల నిర్మాణ భద్రతను బలోపేతం చేయడం, భవిష్యత్ వరదల ప్రభావాన్ని తట్టుకునేలా అవసరమైన చర్యలు చేపట్టడంపై అధికారులతో చర్చించారు. నిపుణుల సూచనలు, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ చేసిన సిఫార్సులను

(మిగతా 2వ పేజీలో)



# రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

రైతుబంధుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కేటీఆర్

హామీలు అమలు కాలేదని ఆరోపణ

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా

28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే

(మిగతా 2వ పేజీలో)

## తెలంగాణలో 200 కొత్త జూనియర్ సివిల్ కోర్టులు..
# కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం

రాష్ట్రంలో న్యాయవ్యవస్థను బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో తొలి విడతలో 200 కొత్త అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు న్యాయ వ్యవహారాల కార్యదర్శి బి. పాపిరెడ్డి ఈ నెల 24న జీవో ఎంఎస్ నెం.59 జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 594 కొత్త కోర్టులు ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం, ఆర్థిక శాఖ ఆమోదంతో మొదటి దశలో 200 కోర్టులను మంజూరు చేసింది. కక్షిదారులకు కోర్టులను మరింత చేరువ చేయడం, ప్రస్తుతం ఉన్న న్యాయమూర్తులపై పని భారాన్ని తగ్గించడం దీని ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వం తన ఉత్తర్వులలో స్పష్టం చేసింది. కొత్తగా మంజూరైన కోర్టులలో అత్యధికంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలోనే 71 కోర్టులు ఏర్పాటు కానున్నాయి. ఇందులో రంగారెడ్డి జిల్లాకు 30, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు 25, హైదరాబాద్ జిల్లాకు 16 కోర్టులు కేటాయించారు. ఇతర జిల్లాలైన నల్గొండకు 10, సంగారెడ్డి, ఖమ్మంలకు చెరో ఎనిమిది చొప్పున కోర్టులు మంజూరయ్యాయి. 2025 జూన్ నాటికి రాష్ట్రంలోని జిల్లా కోర్టులలో సుమారు 9.38 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త కోర్టుల ఏర్పాటు కేసుల విచారణను వేగవంతం చేస్తుందని అధికారులు ఆశిస్తున్నారు. అయితే, ఇది కేవలం కోర్టుల ఏర్పాటుకు సంబంధించిన ఉత్తర్వు మాత్రమే. సిబ్బంది నియామకం, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతే ఈ కోర్టులు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తాయి.



## వచ్చే వర్షాకాలానికి కాళేశ్వరం బ్యారేజీల్లో నీటి నిల్వ



పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా పునాదులను గ్రౌటింగ్ ద్వారా బలోపేతం చేయడం, స్టిల్లింగ్ బేసిన్లను పొడిగించడం, అవసరమైన ప్రాంతాల్లో కటాఫ్ వాల్స్ నిర్మించడం వంటి పనులను ప్రతిపాదించినట్లు వివరించారు. వరద నీటి ప్రవాహాన్ని నియంత్రించడం, పునాదుల స్థిరత్వాన్ని పెంచడం, నీటి చౌరబాటును అరికట్టడం ప్రధాన లక్ష్యాలని చెప్పారు. పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను పుణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా కేంద్రంలో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ నమూనాల ద్వారా పరీక్షిస్తున్నట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. వివిధ స్థాయిల్లో వరద ప్రవాహం ఉన్నప్పుడు బ్యారేజీలపై పడే ప్రభావాన్ని అంచనా వేయడంతోపాటు, ప్రతిపాదిత నిర్మాణ మార్పుల పనితీరును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. తుది డిజైన్లను అక్టోబర్ 5న న్యూఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందు సమర్పించనున్నట్లు మంత్రి చెప్పారు. కమిటీ సూచనలు, సిఫార్సుల మేరకు అవసరమైన మార్పులు చేపట్టి సాంకేతిక అనుమతులు పొందేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనుమతులు లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులకు సంబంధించిన వ్యయ అంచనాలను సిద్ధం చేయడంతోపాటు, కాంట్రాక్టు విధానాన్ని కూడా ఖరారు చేస్తున్నట్లు చెప్పారు. పనుల అమలులో కఠినమైన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, అవసరమైన చోట స్వతంత్ర సంస్థలతో పరీక్షలు నిర్వహించాలని మంత్రి సూచించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తాత్కాలిక మరమ్మతులకు పరిమితం కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మూడు బ్యారేజీలను సాంకేతికంగా పటిష్టంగా పునరుద్ధరిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పునరుద్ధరణ పూర్తయి భద్రతా ధ్రువీకరణ వచ్చిన తర్వాతే బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

# భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం



సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

**కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి**

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

**నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు**

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు. గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గొట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## తెలంగాణలో టెట్ ఫలితాలు విడుదల..

### 70.07 శాతం ఉత్తీర్ణత

**టీజీటెట్ ఇన్-సర్వీస్-2026 ఫలితాలు విడుదల**

**22,477 మందిలో 15,749 మంది అర్హత**

**పేపర్-1లో 68.76 శాతం మంది పాస్**

**గణితం, సైన్స్‌లో 73.60 శాతం ఉత్తీర్ణత**

**సోషల్ స్టడీస్‌లో 67 శాతం మంది అర్హత**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన టీజీటెట్-ఇన్‌సర్వీస్ టీచర్స్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, టీజీటెట్ ఛైర్‌పర్సన్ శనివారం ఫలితాలను విడుదల చేశారు. జులై 21న విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించారు. మూడు విడతల్లో ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. మొత్తం 24,986 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 22,477 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 15,749 మంది అర్హత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 70.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పేపర్-1లో 4,942 మంది పరీక్షకు హాజరుకాగా.. 3,398 మంది (68.76%) అర్హత సాధించారు. పేపర్-2 గణితం, సైన్స్ విభాగంలో 9,131 మంది పరీక్ష రాశారు. వీరిలో 6,720 మంది (73.60%) ఉత్తీర్ణులయ్యారు. పేపర్-2 సోషల్ స్టడీస్‌లో 8,404 మంది పరీక్షకు హాజరుకాగా.. 5,631 మంది (67%) అర్హత సాధించారు. అభ్యర్థులు తమ ఫలితాలతో పాటు మార్కుల వివరాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సమీపంలోని మీ-సేవ కేంద్రాల్లోనూ మార్కుల వివరాలను పొందవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి: సీఎం రేవంత్

పోషించారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలోనూ ఆయన ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నారని గుర్తుచేశారు. దేశ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో 1991లో ఆర్థిక మంత్రిగా మన్మోహన్‌సింగ్ చేపట్టిన సంస్కరణలను రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపాయని పేర్కొన్నారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాన్ని సీఎం ప్రస్తావించారు. రాష్ట్ర ఏర్పాటు ఉత్తర్వుపై మన్మోహన్‌సింగ్ సంతకం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన విగ్రహం వద్ద ఆ సంతకానికి సంబంధించిన అంశాన్ని కూడా ప్రదర్శించినట్లు తెలిపారు. మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి పలు చట్టాలు, కార్యక్రమాలు అమల్లోకి వచ్చిన విషయాన్ని రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. అలాగే ఢిల్లీలో మన్మోహన్‌సింగ్ పేరిట స్మారకాన్ని ఏర్పాటు చేసి, అందులో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. భవిష్యత్ తరాలకు ఆయన ఆలోచనలు, ఆర్థిక సంస్కరణలు, ప్రజా జీవితాన్ని పరిచయం చేసేలా విజ్ఞాన కేంద్రం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావించాలని కాంగ్రెస్ ఎంపీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రేవంత్ ‘నిజాయతీ గల మోసగాడు’: కేటీఆర్

దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి ‘అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు’ తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28 నుంచి చేపట్టే పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

## ఖైరతాబాద్ లో పోటీ చేస్తాం.. నా ఫాంహౌస్ కబ్జా భూమి కాదు: కవిత

ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో తాము నిలవబోతున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున అధికారికంగా అభ్యర్థిని బరిలోకి దించనున్నట్లు ఆమె ప్రకటించారు. ఇదే సమయంలో ఫిరాయింపు రాజకీయాలపై మండిపడిన ఆమె... ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, వేరే పార్టీలోకి వెళ్లి ఎంపీగా పోటీ చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని దానం నాగేందర్ తీరును పరోక్షంగా తప్పుబట్టారు. ఇక కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణపై స్పందిస్తూ... కేవలం క్లరికల్ తప్పుల పేరుతో ఓట్లు తొలగిస్తున్నారనే విమర్శలున్నాయని, బీజేపీని ప్రసన్నం చేసుకునేలా ఈ కుట్ర జరుగుతోందన్న చర్చ ప్రజల్లో నడుస్తోందని ఆమె ఆరోపించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో వరుసగా చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని, ప్రభుత్వం వాటిని తక్షణమే చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. నిమ్స్, నీలోఫర్ వంటి పెద్ద ఆసుపత్రులలో మంత్రులు స్వయంగా ఫోన్ చేసినా బెడ్లు దొరకని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 11 రకాల ఆరోగ్య పథకాలకు కనీస బడ్జెట్ కేటాయించలేదని, ఆరోగ్యశ్రీ బకాయిలను కూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆసుపత్రులను మంత్రులు పట్టించుకోవడం మానేశారని విమర్శించిన కవిత... జిల్లాల కలెక్టర్లు క్రమం తప్పకుండా హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేయాలని సూచించారు. తాము కూడా తెలంగాణ రక్షణ సేన తరఫున ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి పరిస్థితులను మదింపు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇన్ని పసిమొగ్గలు రాలిపోతుంటే... తెలంగాణను సింగపూర్, డల్లాస్ చేస్తామని సీఎం, మంత్రులు ఎలా గొప్పలు చెప్పుకుంటారని నిలదీశారు. ఐటీడీఏకు కేంద్రం నుంచి వచ్చిన నిధుల్లో ఏకంగా 70 శాతం నిధులను ఖర్చు చేయకుండా వృథా చేశారని ఆరోపించారు. కోఠి ఆసుపత్రిలో మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామన్న ప్రతిపాదనను గత బీఆర్ఎస్ హయాంలోనే అడ్డుకున్నారని గుర్తుచేశారు. తన ఫామ్‌హౌస్‌పై వస్తున్న ఆరోపణలను కవిత పూర్తిగా ఖండించారు. తనది ఎలాంటి కబ్జా భూమి కాదని, ఇనాం లేదా అసైన్డ్ భూమి అంతకంటే కానేకాదని స్పష్టం చేశారు. తన ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో కూడా లేదని స్పష్టం చేస్తూ... తన ఆస్తులకు సంబంధించిన ప్రతి వివరమూ ఎన్నికల అఫిడవిట్లోనే స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై, ఇతర ప్రతిపక్ష నేతలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ఫామ్‌హౌస్‌లకు వెళ్లిన పెద్దలు అప్పట్లో ఎందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు.

## నిమజ్జనం సక్సెస్.. పోలీసులతో కలిసి సీపీ సజ్జనార్ డ్యాన్స్

**హైదరాబాద్‌లో ప్రశాంతంగా ముగిసిన గణేశ్ నిమజ్జనం**

**విజయవంతమైన బందోబస్తుతో పోలీసుల సంబరాలు**

**సిబ్బందితో కలిసి డ్యాన్స్ చేసిన హైదరాబాద్ సీపీ సజ్జనార్**

**ట్యాంక్‌బండ్, అసెంబ్లీ వైపు ట్రాఫిక్ ఆంక్షల ఎత్తివేత**



హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును విజయవంతంగా నిర్వహించడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తన సిబ్బందితో కలిసి సంబరాలు జరుపుకున్నారు. నిమజ్జన ప్రక్రియ ముగిసిన అనంతరం, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ కింద పోలీసు సిబ్బందితో కలిసి సీపీ సజ్జనార్ నృత్యం చేశారు. ‘ది ప్యారడైజ్’ చిత్రంలోని ‘ఆయా షేర్’ పాటకు ఆయన చిందులేశారు. గత కొన్ని రోజులుగా విధుల్లో నిమగ్నమై అప్రమత్తంగా ఉన్న పోలీసులు, నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి కావడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి స్వయంగా వారితో కలవడంతో సిబ్బందిలో ఉత్సాహం రెట్టింపైంది. మరోవైపు, నగరంలో నిమజ్జన క్రతువు ముగియడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేశారు. సచివాలయం పరిసర ప్రాంతాలైన ట్యాంక్‌బండ్, లిబర్టీ, అసెంబ్లీ మార్గాల్లో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సాధారణ స్థితికి చేరుకుంది.

# డిగ్రీ కాలేజీల మూసివేత..

# ఉన్నత విద్యకు ఇది మేలుకొలుపు

**విద్యార్థులు రాకపోతే కాలేజీల ఉనికి ప్రశ్నార్థకమే.. కానీ మూసివేతే పరిష్కారం కాదు. కోర్సుల మార్పు, నాణ్యమైన బోధన, ఉపాధి అవకాశాలతో అనుసంధానం, గ్రామీణ విద్యార్థులకు అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళిక అవసరంలిలి**




తెలంగాణలో డిగ్రీ విద్య ఎదుర్కొంటున్న సంక్షోభం ఇప్పుడు కేవలం కొన్ని కాలేజీల సమస్యగా చూడలేం. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ సీట్లు భారీగా ఖాళీగా ఉండటం, కొన్ని కాలేజీల్లో ఒక్క విద్యార్థి కూడా చేరకపోవడం ఉన్నత విద్యా వ్యవస్థలో జరుగుతున్న మార్పులకు స్పష్టమైన సంకేతం. 2026–27 విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాల పరిస్థితి ఆందోళన కలిగించే స్థాయికి చేరింది. ప్రత్యేక దశ ప్రవేశాల అనంతరం కూడా రాష్ట్రంలోని 3,73,149 డిగ్రీ సీట్లలో 1,88,774 సీట్లు ఖాళీగా ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. అంటే సగానికి పైగా సీట్లు భర్తీ కాలేదు.

ఇక 56 ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. ఈ కాలేజీల్లో కలిపి 16,460 సీట్లు ఉన్నప్పటికీ పూర్తిగా ఖాళీగా మిగిలాయి. ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. మౌలిక వసతులు, అధ్యాపకుల కొరత వంటి అంశాలు కూడా విద్యార్థులు కాలేజీలను ఎంచుకోకపోవడానికి కారణాలుగా పేర్కొంటున్నారు. వరుసగా మూడేళ్లు ప్రవేశాలు లేకపోతే కాలేజీలను మూసివేయడం లేదా అనుబంధ గుర్తింపును రద్దు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**కాలేజీలో విద్యార్థులు లేకపోతే దాన్ని కేవలం పేరుకే కొనసాగించడం వల్ల ప్రయోజనం ఏమిటన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. భవనాలు ఉన్నాయి, సీట్లు ఉన్నాయి, కానీ తరగతి గదుల్లో విద్యార్థులు లేరు. ఇలాంటి సంస్థలను ప్రజాధనంతోనో, కుటుంబాల డబ్బుతోనో కొనసాగించడం సమర్థనీయం కాదు. నాణ్యత లేని సంస్థలకు గుర్తింపు కొనసాగించడం విద్యార్థుల భవిష్యత్తుకూ ప్రమాదమే. ఈ కోణంలో చూస్తే అవసరం లేని, వరుసగా ప్రవేశాలు లేని సంస్థలపై సమీక్ష అవసరం.**

అయితే 'విద్యార్థులు లేరు కాబట్టి కాలేజీ మూసివేయాలి' అనే ఒక్క నిర్ణయంతో సమస్య పరిష్కారం కాదు. అసలు ప్రశ్న ఏమిటంటే విద్యార్థులు ఎందుకు రావడం లేదు? ఈ ప్రశ్నకు సమాధానం కనుగొనకుండా కాలేజీలను మూసివేస్తే సమస్యకు మూలకారణం అలాగే ఉంటుంది.

**గత కొన్నేళ్లుగా ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. ఇంజినీరింగ్, వైద్య విద్యతో పాటు వివిధ వృత్తి ఆధారిత కోర్సులు, నైపుణ్య శిక్షణ, కంప్యూటర్ సంబంధిత కోర్సులు, విదేశీ విద్య వంటి అవకాశాల వైపు విద్యార్థులు ఎక్కువగా చూస్తున్నారు. సాధారణ బీఏ, బీఎస్సీ వంటి సంప్రదాయ కోర్సులు చదివిన తర్వాత ఉద్యోగం దొరకడం ఎంతవరకు సాధ్యమో అనే సందేహం తల్లిదండ్రుల్లోనూ, విద్యార్థుల్లోనూ పెరిగింది. వాణిజ్య, శాస్త్ర విభాగాలపై ఆసక్తి కొనసాగుతున్నప్పటికీ సంప్రదాయ కళల కోర్సులకు డిమాండ్ తగ్గుతున్న పరిస్థితి కనిపిస్తోంది.**

ఇది కేవలం విద్యార్థుల తప్పు కాదు. విద్యా వ్యవస్థ కూడా తనను తాను మార్చుకోవాల్సిన సమయం వచ్చింది. ఒకప్పుడు సాధారణ డిగ్రీ పట్టా ఉద్యోగానికి తలుపులు తెరిచేది. ఇప్పుడు పట్టా ఒక్కటే సరిపోవడం లేదు. పట్టాతో పాటు నైపుణ్యం, కమ్యూనికేషన్, సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమ అవసరాలపై అవగాహన అవసరం. ఈ మార్పుకు అనుగుణంగా డిగ్రీ కాలేజీలు తమ బోధనా విధానాన్ని, కోర్సులను, ప్రయోగశాలలను, పరిశ్రమలతో సంబంధాలను మార్చుకోకపోతే విద్యార్థులు ఇతర మార్గాలను ఎంచుకోవడం సహజమే.

మరో ముఖ్యమైన అంశం ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల మధ్య ఏర్పడుతున్న అసమతుల్యత. డిగ్రీ ప్రవేశాల్లో ప్రభుత్వ కాలేజీలకు విద్యార్థుల నుంచి గణనీయమైన స్పందన రావడం ఒక ముఖ్యమైన పరిణామం. తక్కువ ఖర్చుతో, మెరుగైన మౌలిక వసతులతో, నమ్మకమైన విద్యా వాతావరణంతో ఉన్న ప్రభుత్వ సంస్థలకు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు అనేక ప్రైవేటు కాలేజీలు ఫీజు చెల్లింపులు, మౌలిక వసతులు, అధ్యాపకుల నియామకం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యను కూడా విస్మరించలేం. ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు బకాయిల విడుదల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. చెల్లింపుల ఆలస్యం అధ్యాపకుల జీతాలు, నిర్వహణ ఖర్చులు, విద్యా మౌలిక వసతులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనకుండా కేవలం తాత్కాలికంగా నిధులు విడుదల చేయడం ద్వారా మొత్తం వ్యవస్థను నిలబెట్టడం సాధ్యం కాదు.**

అందువల్ల కాలేజీల మూసివేతపై నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వం సమగ్ర ఆడిట్ నిర్వహించాలి. ప్రతి కాలేజీకి గత ఐదేళ్ల ప్రవేశాల వివరాలు, అధ్యాపకుల సంఖ్య, మౌలిక వసతులు, పరీక్షా ఫలితాలు, విద్యార్థుల ఉపాధి పరిస్థితి, ప్రాంతీయ అవసరం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఒకే ప్రమాణంతో అన్ని కాలేజీలను కొలవడం సరైంది కాదు.

**ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో ఒక కాలేజీకి విద్యార్థులు తక్కువగా ఉండటానికి రవాణా సౌకర్యం లేకపోవడం, సమీపంలోనే మరో కాలేజీ ఉండటం, కొన్ని కోర్సులకు డిమాండ్ లేకపోవడం వంటి కారణాలు ఉండవచ్చు. అలాంటి కాలేజీని వెంటనే మూసివేయడం కంటే సమీప కాలేజీలను విలీనం చేయడం, కోర్సులను మార్చడం, కొత్త నైపుణ్య ఆధారిత కోర్సులను ప్రవేశపెట్టడం వంటి మార్గాలను ముందుగా పరిశీలించాలి.**

**అదే సమయంలో, వరుసగా సంవత్సరాల తరబడి ఒక్క విద్యార్థిని కూడా ఆకర్షించలేని సంస్థలకు మాత్రం ప్రత్యేక మినహాయింపులు ఇవ్వడం కూడా సరైన విధానం కాదు. విద్యా సంస్థ అంటే కేవలం భవనం కాదు. విద్యార్థి, అధ్యాపకుడు, పాఠ్యాంశం, ప్రయోగశాల, గ్రంథాలయం, పరిశోధన, ఉపాధి--- ఇవన్నీ కలిసిన వ్యవస్థ. ఇందులో కనీస ప్రమాణాలు కూడా లేని సంస్థలకు గుర్తింపు కొనసాగించడం విద్యార్థులపై అన్యాయం.**

# భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం

## అంతర్జాతీయ వేదికపై భారత్‌కు పెరుగుతున్న మద్దతు

భారత్‌కు పోర్చుగల్, మారిషస్ దేశాల నుంచి బహిరంగంగా మద్దతు ప్రకటన

భారత్‌తో కూడిన జీ4 కూటమికి మద్దతు పలికిన మార్షల్ ఐలాండ్స్

ఆఫ్రికాకు శాశ్వత ప్రాతినిధ్యం ఇవ్వాలని ఆ దేశాల నుంచి బలమైన డిమాండ్

సంస్కరణలపై ఏకాభిప్రాయం ఉన్నా వీటో అధికారంపై భిన్నాభిప్రాయాలు



ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు అంతర్జాతీయ వేదికపై మద్దతు పెరుగుతోంది. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న 81వ సర్వసభ్య సభ (ఖచీ+ూా) సమావేశాల్లో పలు దేశాలు భారత్ వాదనకు అండగా నిలిచాయి. పోర్చుగల్, మారిషస్ దేశాలు నేరుగా భారత్‌కు మద్దతు ప్రకటించగా, మార్షల్ ఐలాండ్స్ జీ4 కూటమికి జై కొట్టింది. భద్రతా మండలిని ప్రస్తుత రాజకీయ వాస్తవాలకు అనుగుణంగా విస్తరించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. సమావేశాల సందర్భంగా పోర్చుగల్ ప్రధాని లూయిస్ మోంటెనెగ్రో మాట్లాడుతూ, భద్రతా మండలిలో ప్రాతినిధ్యం పెరగాలని, ఆఫ్రికా, బ్రెజిల్, భారత్‌లకు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని పిలుపునిచ్చారు. మారిషస్ విదేశాంగ మంత్రి ధనంజయ్ రామ్‌ఫుల్ అత్యంత స్పష్టమైన మద్దతును ప్రకటించారు. "ప్రపంచ వ్యవహారాల్లో భారత్ పోషిస్తున్న నిర్మాణాత్మక పాత్రకు అనుగుణంగా, శాశ్వత సభ్యత్వం కోసం ఆ దేశ అభ్యర్థిత్వాన్ని మేం సమర్థిస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. జీ4, ఎల్69 గ్రూపుల వాదనలకు కూడా తమ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. భారత్, బ్రెజిల్, జర్మనీ, జపాన్‌లతో కూడిన జీ4 కూటమికి కూడా మద్దతు లభించింది. మార్షల్ ఐలాండ్స్ అధ్యక్షురాలు హిల్డా హీన్ మాట్లాడుతూ, "భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం జపాన్, దాని జీ4 భాగస్వాములకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది" అని ప్రకటించారు. దీని ద్వారా ఆమె పరోక్షంగా భారత్‌కు మద్దతు పలికినట్టయింది. ఈ సమావేశాల్లో ఆఫ్రికా దేశాల నుంచి సంస్కరణల కోసం అత్యంత బలమైన గళం వినిపించింది. సియెర్రా లియోన్ అధ్యక్షుడు జూలియస్ మాదా బయో మాట్లాడుతూ, "భద్రతా మండలి ఇప్పటికీ 1945 నాటి ప్రపంచాన్ని ప్రతిబింబిస్తోంది. 160 కోట్లకు పైగా జనాభా ఉన్న ఆఫ్రికాకు ఇప్పటికీ శాశ్వత స్థానం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఘనా అధ్యక్షుడు జాన్ డ్రమానీ మహామ మాట్లాడుతూ, "భద్రతా మండలి సంస్కరణ అనేది ఆఫ్రికాకు చేసే మేలు కాదు.. ఐరాస విశ్వసనీయత, మనుగడకు ఇది అత్యవసరం" అని అన్నారు. అయితే, భద్రతా మండలి సంస్కరణలు జరగాలన్న దానిపై విస్తృత ఏకాభిప్రాయం ఉన్నప్పటికీ, ఏ దేశాలకు అవకాశం ఇవ్వాలి, ప్రాంతీయ కేటాయింపులు, ముఖ్యంగా వీటో అధికారంపై భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, అమెరికా శాశ్వత సభ్యులుగా ఉన్న ఈ మండలి కూర్పును మార్చాలంటే, సర్వసభ్య సభలో మూడింట రెండొంతుల సభ్యుల ఆమోదంతో పాటు, ఐదు శాశ్వత సభ్య దేశాలు కూడా ఆమోదించాల్సి ఉంటుంది. ఈ కారణాల వల్లే సంస్కరణల ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

## సంపాదకీయం

### శాంతి ప్రతిపాదనకు తలుపులు మూస్తే..

# ఇరాన్ సంక్షోభం ఎటు?

అమెరికా–ఇరాన్ ఘర్షణ మరోసారి అత్యంత సున్నితమైన దశకు చేరుకుంది. యుద్ధాన్ని నిలిపివేసి, కీలకమైన హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఏడు రోజుల వ్యవధిలో చర్యలు చేపట్టాలన్న ఇరాన్ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. అదే సమయంలో నవంబర్‌లో అమెరికా మధ్యంతర ఎన్నికలు ముగిసిన తర్వాత ఇరాన్‌పై అమెరికా దాడులు మళ్లీ ప్రారంభమయ్యే అవకాశముందని అమెరికా అధికారులను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ట్రంప్ స్వయంగా ఇరాన్ ప్రతిపాదనను తిరస్కరించినట్లు చెప్పిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది.

ఈ పరిణామాన్ని కేవలం అమెరికా–ఇరాన్ ద్వైపాక్షిక వివాదంగా చూడటం సరిపోదు. హోర్ముజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన మార్గం. సాధారణ పరిస్థితుల్లో ప్రపంచ చమురు, సహజవాయువు రవాణాలో గణనీయమైన భాగం ఈ మార్గం గుండా సాగుతుంది. అక్కడ రవాణాకు అంతరాయం కొనసాగితే దాని ప్రభావం చమురు ధరల నుంచి రవాణా ఖర్చుల వరకు, ద్రవ్యోల్బణం నుంచి పరిశ్రమల ఉత్పత్తి వ్యయం వరకు విస్తరించే అవకాశం ఉంటుంది. అందువల్ల ఈ ఘర్షణలో ప్రతి సైనిక నిర్ణయానికి ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిణామాలు ముడిపడి ఉన్నాయి.

ఇరాన్ ప్రతిపాదనలో హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం, అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని తొలగించడం, ఇరాన్ చమురు ఎగుమతులపై ఆంక్షలను సడలించడం, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల్లో కొంత భాగాన్ని విడుదల చేయడం వంటి అంశాలు ఉన్నట్లు వెల్లడైంది. ప్రాంతీయంగా కాల్పుల విరమణ, అణు చర్చలను తిరిగి ప్రారంభించడం కూడా ప్రతిపాదనలో భాగంగా ఉన్నట్లు ఇరాన్ వర్గాలు తెలిపాయి. అమెరికా అంగీకరిస్తే కొన్ని రోజుల వ్యవధిలో హోర్ముజ్ మార్గాన్ని తెరవడం, అనంతరం విస్తృత చర్చలను ప్రారంభించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

అయితే ఈ ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించారు. ఇదే సమయంలో నవంబర్‌లో జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికలు ఈ సంక్షోభంలో ఒక కీలక కాలరేఖగా మారాయి. ఎన్నికల తర్వాత ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ట్రంప్ గతంలో పేర్కొనడంతోపాటు, ఒప్పందం కుదరకపోతే మరింత కఠినమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. అయితే ఇరాన్‌పై తన విధానం ఎన్నికల ప్రభావంతో నిర్ణయించబడటం లేదని కూడా ఆయన పేర్కొన్నారు.

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. యుద్ధం ద్వారా సాధించాలనుకుంటున్న లక్ష్యాలు ఏమిటి? ఆ లక్ష్యాలను సైనిక చర్యల ద్వారానే సాధించగలమా? లేక ఆంక్షలు, దౌత్యం, అణు చర్చలు, ప్రాంతీయ భద్రతా హామీలు వంటి మార్గాలను సమాంతరంగా కొనసాగించగలమా? ఇరాన్ అణు కార్యక్రమం, దాని సైనిక సామర్థ్యం, ప్రాంతీయ మిత్రబలగాలు, హోర్ముజ్ జలసంధిపై దాని వ్యూహాత్మక ప్రభావం వంటి అంశాలు అమెరికా భద్రతా ఆందోళనలకు కేంద్రంగా ఉన్నాయి. మరోవైపు ఇరాన్ తన భద్రత, సార్వభౌమాధికారం, ఆంక్షల ఉపశమనం, అణు కార్యక్రమంపై చర్చల విషయంలో హామీలను కోరుతోంది. ఈ రెండు వైపుల లక్ష్యాల మధ్య అంతరం తగ్గించకపోతే సైనిక ఘర్షణకు ముగింపు పలకడం కష్టమే.

ఒక శాంతి ప్రతిపాదనను అంగీకరించకపోవడం లేదా తిరస్కరించడం అంతర్జాతీయ దౌత్యంలో అసాధారణం కాదు. ఒక ప్రతిపాదనలోని షరతులు ప్రత్యర్థి దేశానికి ఆమోదయోగ్యంగా లేకపోవచ్చు. అయితే ప్రత్యామ్నాయ చర్చల మార్గాలను పూర్తిగా మూసివేయడం మాత్రం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేయగలదు. ఇరాన్ ప్రతిపాదనలోని అంశాలు అమెరికాకు సరిపోకపోతే, వాటిపై సవరణలు కోరడం, దశలవారీ ఒప్పందం కోసం ప్రయత్నించడం, మధ్యవర్తుల ద్వారా కొత్త రూపకల్పన చేయడం వంటి మార్గాలు అందుబాటులో ఉంటాయి. మధ్యవర్తుల ద్వారా ఇరాన్--అమెరికా మధ్య సందేశాలు చేరుతున్న నేపథ్యంలో దౌత్య మార్గం పూర్తిగా అంతరించిపోలేదన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

ప్రస్తుతం అత్యంత ఆందోళన కలిగించే అంశం హోర్ముజ్ జలసంధి. ప్రపంచ ఇంధన మార్కెట్‌కు అది కీలకమైన నాడి. అక్కడ నౌకాయానం సాధారణ స్థాయికి రాకపోతే ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరా గొలుసుపై ఒత్తిడి పెరుగుతుంది. ఇంధన ధరలు పెరిగితే దాని ప్రభావం విమానయానం, రవాణా, విద్యుత్, తయారీ రంగాలపై పడుతుంది. చివరికి వినియోగదారుడి ఖర్చులు పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే పశ్చిమాసియా యుద్ధం ప్రపంచ ఇంధన మార్కెట్లను ప్రభావితం చేస్తోంది. పరిస్థితి మరింత ముదిరితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం తప్పకపోవచ్చు.

ఇది భారతదేశానికి కూడా అత్యంత కీలకమైన అంశమే. భారత్ తన ముడి చమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. ప్రపంచ చమురు ధరలు పెరిగితే దేశీయ రవాణా వ్యయాలు, పరిశ్రమల ముడి పదార్థాల ఖర్చులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరిగే అవకాశం ఉంటుంది. రూపాయి--డాలర్ మారకపు విలువపై కూడా ప్రభావం పడవచ్చు. అందువల్ల పశ్చిమాసియాలో యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందన్నది ఢిల్లీకి కూడా ఆర్థికంగా ముఖ్యమైన ప్రశ్న.

అమెరికా సైనిక సామర్థ్యానికి సంబంధించిన అంశం కూడా సంక్లిష్టమే. ఇరాన్‌పై దీర్ఘకాలిక సైనిక చర్యలు కొనసాగితే ఆయుధ నిల్వలు, క్షిపణి నిరోధక వ్యవస్థలు, సరఫరా సామర్థ్యంపై ఒత్తిడి పెరగవచ్చని కొన్ని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు అమెరికా వద్ద తగినంత సైనిక సామర్థ్యం ఉందని ట్రంప్ చెబుతున్నారు. ఇలాంటి విభిన్న అంచనాల మధ్య యుద్ధాన్ని దీర్ఘకాలం కొనసాగించడం వల్ల ఏర్పడే వ్యూహాత్మక, ఆర్థిక వ్యయాన్ని కూడా అమెరికా విధాన నిర్ణేతలు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

ఇరాన్ విషయంలో మరో సంక్లిష్టత ఉంది. సైనిక దాడులతో ఒక దేశానికి చెందిన నిర్దిష్ట మౌలిక సదుపాయాలను దెబ్బతీయడం సాధ్యమైనప్పటికీ, దీర్ఘకాలికంగా ఆ దేశ రాజకీయ వైఖరిని మార్చడం లేదా శాశ్వత భద్రతా పరిష్కారాన్ని సాధించడం అంత సులభం కాదు. సైనిక ఒత్తిడి చర్చలకు దారితీసే సందర్భాలు ఉన్నాయి. అదే సమయంలో అదే ఒత్తిడి ప్రతీకార చర్యలను కూడా పెంచవచ్చు. హోర్ముజ్ జలసంధి, ప్రాంతీయ మిత్రబలగాలు, ఇంధన మౌలిక సదుపాయాలు వంటి అంశాలు ఈ ఘర్షణకు మరింత విస్తృత పరిధిని ఇస్తున్నాయి.

అమెరికా అధ్యక్షుడి తాజా వైఖరి నేపథ్యంలో నవంబర్ ఎన్నికల తర్వాత పరిస్థితి ఏ దిశగా వెళ్తుందన్నది అంతర్జాతీయంగా ఆసక్తికరంగా మారింది. కొన్ని విశ్లేషణలు ఎన్నికల ఫలితాలు అమెరికా ఇరాన్ విధానంపై ప్రభావం చూపవచ్చని పేర్కొంటున్నాయి. అయితే ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్నది ముందుగా నిర్ధారించడం సాధ్యం కాదు. ప్రస్తుతానికి స్పష్టంగా కనిపిస్తున్నది మాత్రం ఒకటే---నవంబర్ ఎన్నికలు ఈ సంక్షోభానికి ఒక ముఖ్యమైన రాజకీయ కాలరేఖగా మారాయి.

ఇలాంటి సమయంలో దౌత్యానికి ఉన్న ప్రాధాన్యం మరింత పెరుగుతుంది. అమెరికా తన భద్రతా ప్రయోజనాలను కాపాడుకోవడం సహజమే. ఇరాన్ కూడా తన సార్వభౌమాధికారాన్ని, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవాలని చూస్తుంది. కానీ రెండు దేశాల ప్రయోజనాలను పూర్తిగా విరుద్ధ ధృవాలుగా మాత్రమే చూడటం సమస్యకు పరిష్కారం చూపదు. పరస్పర భద్రతా హామీలు, అణు కార్యక్రమంపై పర్యవేక్షణ, ఆంక్షల దశలవారీ సడలింపు, హోర్ముజ్‌లో స్వేచ్ఛాయుత నౌకాయానం, ప్రాంతీయ కాల్పుల విరమణ వంటి అంశాలను ఒకే చర్చా చట్రంలోకి తీసుకురావడం ఒక మార్గంగా ఉండవచ్చు.

ప్రపంచ సమాజం పాత్ర కూడా ఇక్కడ ముఖ్యమే. ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ దేశాలు, గల్ఫ్ దేశాలు, భారత్ వంటి దేశాలు ప్రత్యక్షంగా యుద్ధంలో భాగస్వాములు కాకపోయినా, ఇంధన భద్రత, నౌకాయానం, మానవతా సహాయం, దౌత్య చర్చల విషయంలో ప్రభావం చూపగలవు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు హోర్ముజ్ జలసంధి స్థిరత్వం నేరుగా ఆర్థిక ప్రయోజనాలతో ముడిపడి ఉంది. అందువల్ల ప్రాంతీయ దేశాలు కూడా ఘర్షణ తగ్గింపునకు మధ్యవర్తిత్వం చేయగల అవకాశం ఉంది.



**-గుర్రం పాపిరెడ్డి**
**ఎడిటర్**

# చాకలి ఐలమ్మ 131వ జయంతి ఘనంగా నిర్వహణ

## పెద్దతుప్రలో రజక సామాజిక వర్గం ఆధ్వర్యంలో ఘన నివాళులు



అరుణ ప్రభ -- శంషాబాద్ జోన్ : శంషాబాద్, సెప్టెంబర్ 26: శంషాబాద్ మండలంలోని పెద్దతుప్ర గ్రామంలో రజక సామాజిక వర్గం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్, సర్పంచ్ అంకం సుమలత రాజు యాదవ్, ఉపసర్పంచ్ దిద్యాల శేఖర్, వార్డు సభ్యులు దిద్యాల నరేష్ కుమార్, దిద్యాల సునీత రాజు, ఫాక్స్ డైరెక్టర్ దిద్యాల గౌతమ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు దిద్యాల శశికాంత్, ఉపాధ్యక్షుడు జయం రాజు పాల్గొన్నారు. అలాగే కార్యవర్గ సభ్యులు బి. విజయ్, ఎన్. శ్రీచరణ్, చిర్ర దాసు, బంగారం ఆంజనేయులు, ఎం.డి. ఆజం, దిద్యాల సురేష్, దిద్యాల చెన్నకేశవ్, దిద్యాల వెంకటయ్య, దిద్యాల పోచయ్య, దిద్యాల రమాకాంత్, దిద్యాల శేఖర్, దిద్యాల గోవర్ధన్, దిద్యాల సందీప్, దిద్యాల స్వామి, దిద్యాల సతీష్, దిద్యాల రాములు, దిద్యాల శ్రీకాంత్, దిద్యాల పరశురాం, దిద్యాల వెంకటేష్, దిద్యాల అంజయ్య, దిద్యాల బాలరాజ్, దిద్యాల ప్రవీణ్, దిద్యాల రమేష్, గంగాపురం అంజయ్య, కట్టుకూరి ప్రవీణ్, కట్యారి సురేష్ తదితరులు పాల్గొన్నారు. రజక సామాజిక వర్గం సభ్యులు, పార్టీ సీనియర్ కార్యకర్తలు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై వీరనారి చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించారు.

# సిద్ధాంతి కట్ట మైసమ్మ ఆలయం ఎదుట ఘనంగా చాకలి ఐలమ్మ 131వ జయంతి

## వీరనారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



అరుణ ప్రభ -- శంషాబాద్ జోన్ : శంషాబాద్, సెప్టెంబర్ 26: జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని సిద్ధాంతి కట్ట మైసమ్మ ఆలయం ఎదురుగా ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఆమె 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. నిజాం పాలనకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఐలమ్మ ధైర్యంగా నిలబడ్డారని పేర్కొన్నారు. పాలకుర్తి పరిసర ప్రాంతాల్లో కుటుంబం కౌలుకు తీసుకున్న భూమిని సాగు చేసుకుంటూ, భూస్వాముల నుంచి ఎదురైన ఒత్తిళ్లను ఆమె ధైర్యంగా ఎదుర్కొన్నారని తెలిపారు. ఆంధ్ర మహాసభ నాయకత్వంలో ప్రజలను సమీకరించి, పంటను కాపాడుకునేందుకు పోరాడిన ఐలమ్మ విజయంతో తెలంగాణలో భూపోరాటానికి మరింత స్ఫూర్తి లభించిందన్నారు. చాకలి ఐలమ్మ పోరాటం రైతాంగ ఉద్యమానికి, సామాజిక న్యాయ పోరాటాలకు ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. ఆమె ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ గుప్తా, రాచమల్ల సిద్దేశ్వర్, సుప్మ మహేందర్ రెడ్డి, రణధీర్ రెడ్డి, సంజయ్ యాదవ్, 118వ డివిజన్ అధ్యక్షుడు దూడల వెంకటేష్ గౌడ్, 119వ డివిజన్ అధ్యక్షుడు బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, మండల అధ్యక్షులు మహేందర్, కోటేష్ గౌడ్, బండి గోపాల్ యాదవ్, మేకల వెంకటేష్ ముదిరాజ్, దయానంద్, చేవెళ్ల ప్రసాద్, పెద్దగుండు ప్రభాకర్, సతీష్ రెడ్డి, బండి రమేష్, భాషా భాయ్, నాగేష్ యాదవ్, బొబ్బిలి ఉమామహేష్, తీగల సాయి, గొరిగే పృథ్వి గౌడ్, టీడీపీ జంగయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, రజక సంఘం కమిటీ సభ్యులు, పార్టీ సీనియర్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వీరనారి చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులు అర్పించారు.

# చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూస్వామ్య వ్యవస్థకు, అణచివేతకు వ్యతిరేకంగా గళమెత్తిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట పటిమ భావితరాలకు స్ఫూర్తిదాయకమని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి కొనియాడారు. నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొన్న లిగౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శేట్కర్ గారులి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం గడీల పాలనపై తిరుగుబాటు చేసి తెలంగాణ మహిళల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని పేర్కొన్నారు. తన హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం ప్రతి ఒక్కరిలో చైతన్యాన్ని నింపుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ఐలమ్మ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్. కౌన్సిలర్లు, విజయ్ బుజ్జి. రజక సంఘం సభ్యులు,స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,రజక సంఘం ప్రతినిధులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 9వ ప్యాకేజీ పనులు పూర్తిచేయడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు విఫలం



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: రైతుల సాగునీటి సమస్యకు కీలకమైన 9వ ప్యాకేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేయలేకపోయిందని ఆయన విమర్శించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా పనులు పూర్తికాకపోవడం రైతుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిమ్మాపూర్‌లో 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటికీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. హామీలు కాదు.. పనులు కావాలి.. రైతులకు సాగునీరు కావాలి అని పొన్నాల తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. 9వ ప్యాకేజీ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 28న వీర్నపల్లి మండలంలో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి సిరిసిల్ల జిల్లాకు రానున్న నేపథ్యంలో 9వ ప్యాకేజీ పనుల అంశాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాలని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి పనులు ప్రారంభించకపోతే రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి, నాయకులు ఉడుగుల యాదగిరి, మద్దుల బుగ్గారెడ్డి, కిరణ్ నాయక్, దాసరి గణేష్, చందుపట్ల లక్ష్మారెడ్డి, శరత్‌రెడ్డి, ప్రకాష్, రంజిత్, సంజీవరెడ్డి, బాలగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, బాలకృష్ణ, దయాకర్‌రెడ్డి, నవీన్, తిరుపతి, నాగరాజు, లక్ష్మణ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పండుగ 3.0 ను జయప్రదం చేయండి

## కందుకూరు నియోజవర్గ పరిశీలకులు మట్టం శ్రావణిరెడ్డి



గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ) : ఈనెల 29 వ తేదీన ఉదయగిరి నియోజకవర్గం పరిధిలోని వరికుంట పాడు మండలంలోని రామ పురం గ్రామంలో జరిగే పల్లె పండుగ 3.0 ను జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి , కందుకూరు నియోజవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. కందుకూరులో జరిగిన సన్నాహక సభలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజవర్గంలోని ప్రతి నాయకులు , కార్యకర్తలు, పార్టీ అభిమానులు తప్పకుండా హాజరుకావాలని, అదేవిధంగా పల్లె పండుగను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నియోజవర్గం నుంచి సుమారు పదివేల మందిని తీసుకెళ్లే విధంగా సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

## ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు.

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్రను స్మరించుకున్నారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వరుస కృష్ణహరి, మాజీ జెడ్పిటిసి చీటీ లక్ష్మణ్ రావు, సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచులు అందే సుభాష్, ఎలగందుల నరసింహులు, మాజీ ఏఎంసీ చైర్మన్ గుల్లపల్లి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు మీసం రాజం, పట్టణ అధ్యక్షులు ఎడ్ల సందీప్, రాజిరెడ్డి, దేవరాజు, భూక్య ప్రభు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## భూమి కోసం.. భుక్తి కోసం.. బానిసత్వ విముక్తి కోసం పోరాడిన వీరనారి ఐలమ్మ

## వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతిని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి గజ్వేల్ ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి జగదేవపూర్ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ రజక సంఘం అధ్యక్షుడు అలిరాజిపేట్ సర్పంచ్ రాచ మల్ల ఎల్లేష్ మరియు రజక సంఘం నాయకులు సభ్యులు పాల్గొన్నారు ఈ జయంతి సందర్భంగా జగదేవపూర్ మండలంలోని మునిగడప గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్ ఆవిష్కరించి పూలమాల వేసారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్న సమయంలో చాకలి ఐలమ్మ జయంతిని వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం జరిగింది అన్నారు తెలంగాణ వీరుల చరిత్ర గురించి వారి త్యాగాల ను భవిష్యత్తు తరాల వారికి పరిచయం చేశారన్నారు ఐలమ్మ పోరాట స్ఫూర్తిని గౌరవిస్తూ ఆమె పేరును చిరస్థాయిగా నిలిచే కార్యక్రమాలకు కేసిఆర్ కృషి చేశారన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్మడి శివలక్ష్మిజాంగీర్, మాజీ ఎంపీటీసీ కవితా శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంపల్లి కరుణాకర్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బుద్ద నాగరాజు, అమర రాము, గుబ్బ శ్రీనివాస రావు, బచ్చలి భాస్కర్, బత్తిని శ్రీనివాస్, కందుల బాల్ రాజు, నర్సింహులు సార్, మెతుకు నర్సింలు, రాచకొండ యాదగిరి, రాచకొండ బాల్ నర్సయ్య, రాచకొండ మహేష్, సిద్దిరాల సురేష్, రాచకొండ మహేష్ గ్రామాల సభ్యులు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ కోసం పోరాడాం.. హక్కుల కోసం పోరాడుతాం..

## 10వ రోజుకు చేరిన తెలంగాణ ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలు

## తెలంగాణ ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలు - 10 వ రోజు

అల్వాల్ సర్కిల్ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో, ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 10 వ రోజుకు చేరుకున్నాయి.. ఈరోజు దీక్షలో గ్యార కృష్ణ, పెంట చారి కూర్చున్నారు ఈ కార్యక్రమంలో పాటోళ్ల సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ, దయాకర్, ముత్యాలు, శేరుపల్లి మల్లేష్, సంగమేశ్వర్, రమేష్, మంద ఆనంద్,మేరు గోపాల్ తదితరులు పాల్గొని ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.



# గోవిందుడి సన్నిధిలో భక్తుల ఆధ్యాత్మిక సందడి

బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుభ శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సతీష్ కుమార్, శివరామకృష్ణ, పటోల్ల సురేందర్ రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు

## చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకులు

అరుణ ప్రభ – శంషాబాద్ జోన్ 26 : శంషాబాద్, సెప్టెంబర్ 26: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకుని శంషాబాద్ పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. 119వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు చాకలి ఐలమ్మ చేసిన పోరాటాలను, తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె పోషించిన పాత్రను స్మరించుకున్నారు. సమాజంలో మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్--కొత్వాలగూడ 119వ డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్, రెండు డివిజన్ల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల జయసింహ, సీనియర్ నాయకుడు బైరమోని మల్లేష్, 119వ డివిజన్ ప్రధాన కార్యదర్శులు చిలకమర్రి పరందాములు, చిన్నగండు రాజేందర్, ఉపాధ్యక్షులు పెదిరిపాటి మురళి గౌడ్, గుంటి చరణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచమల్ల రమేష్, జగ్గయ్య, యూత్ ప్రధాన కార్యదర్శి శేఖర్ యాదవ్, ప్రవీణ్ గౌడ్, బీఆర్ఎస్వీ నాయకుడు కనకటి శివ, కనకటి శ్రవణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

## సిరిసిల్లపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణంలోని సాయి మణికంఠ గార్డెన్స్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉదయం జరిగిన ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి సంగీతం శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఆడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి సిరిసిల్ల జిల్లాపై పడిందని, దీంతో ఈ ప్రాంత ప్రజలకు మంచి రోజులు రానున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా మండలాలు, గ్రామాల వారీగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు నాయకులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం, జిల్లా కాంగ్రెస్ నాయకులు, వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సత్తిరెడ్డి కాలనీ రోడ్ నెంబర్ 01లో ఘనంగా వినాయక శోభాయాత్ర

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న తోటకూర అజయ్ యాదవ్, కొత్త కిషోర్ గౌడ్**

**మన గల్లీ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు**



సెప్టెంబర్ 26, అరుణ ప్రభ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సత్తి రెడ్డి కాలనీ రోడ్ నెంబర్ 01, లో మన గల్లి గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు జడిగే మహేందర్ యాదవ్, భూక్యా సుమన్, రాసాలా వెంకటేష్, గుర్రాల వెంకటేష్, సీనియర్ నాయకులు తోటకూర శ్రీశైలం యాదవ్, వెంకటేష్ గుప్తా తదితరులు పాల్గొని గణనాయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్కంఠ భరితంగా, హుషారుగా సాగిన లడ్డు వేలం పాటలో 71,000/- రూపాయలకు మహాగణపతి లడ్డూను నవీన్ గౌడ్ కుటుంబ సభ్యులు, కలశం 6000/- రూపాయలకు కిషన్ కుటుంబం, స్వామి వారి పంచె నవీన్ గౌడ్ కుటుంబం, కాసుల హారం పాక ఆనంద్ వేలం పాటలో దక్కించుకున్నారు. వీరికి ముఖ్య అతిథులు స్వామివారి ప్రసాదాలను అందించారు. వివిధ సంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటాలు, కుంకుమార్చన, దీపోత్సవం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి కమిటీ సభ్యులు, కాలనీవాసులు అత్యంత వైభవంగా వినాయక శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన గల్లీ గణేష్ అసోసియేషన్ సభ్యులు కిషన్, తిరుపతి, వెంకటేశ్వర్లు, మహేందర్, రాకేష్, పాక గణేష్, నర్సింగ్, నాగరాజు, నవీన్, ఆనంద్, సంతోష్, సతీష్, మల్లారెడ్డి, తిరుపతి, పవన్, నరేందర్, వర్షిత్, సహర్ష, రోషన్,కృష్ణ చారి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# జీవితంపై సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి

## చదువే జీవితాన్ని మార్చుతుంది : డీఐఈఓ శరత్‌కుమార్




ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : విద్యార్థులు జీవితంపై సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండటంతో పాటు తమ బాధ్యతలను గుర్తెరిగి, క్రమశిక్షణతో ముందుకు సాగాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) చెరుకు శరత్‌కుమార్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, మంచి మార్గంలో పయనిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆహ్వానోత్సవం (ప్రెషర్స్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా డీఐఈఓ చెరుకు శరత్‌కుమార్, అతిథిగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఐఈఓ శరత్‌కుమార్ మాట్లాడుతూ చదువు మనిషి జీవితాన్ని మార్చే ప్రధాన సాధనమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విధులను నిర్వర్తించడంతో పాటు బాధ్యతలను గుర్తించి క్రమశిక్షణతో ముందుకు సాగాలని, జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. సీఐ వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఎక్కువ మంది సామాన్య, పేద కుటుంబాలకు చెందినవారేనని, తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి పిల్లలను చదివిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తే జీవితంలో విజయాన్ని సాధించవచ్చని అన్నారు. తాను కూడా వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని, తన జీవితాన్ని మార్చినది చదువేనని సీఐ వెంకటేష్ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చదువును మధ్యలో వదిలిపెట్టవద్దని విద్యార్థులకు సూచించారు. బాలికలు సైతం అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, టీనేజ్‌లోనే పక్కదారి పట్టి కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని సూచించారు. మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను గుర్తించి విద్యను అభ్యసించి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేణి పరశురాములు, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణుప్రసాద్, జ్యాతోతు శ్రీనివాస్, గజ్జెల గంగాధర్, అనుముల రవిచంద్ర, వెల్దండి సౌమ్య, అగోలం గౌతమీతో పాటు బోధనేతర సిబ్బంది విమల్‌కుమార్, కనిమేని దేవేందర్, షాహినా సుల్తానా, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పాల్గొనే పబ్లిక్ మీటింగ్ సభా స్థలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 30వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రగుడు బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేయనున్న పబ్లిక్ మీటింగ్ సభా స్థలిని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితె శనివారం పరిశీలించారు. సభ నిర్వహించనున్న ప్రాంతంలో కొనసాగుతున్న స్థలాన్ని చదును చేసే పనులను కలెక్టర్, ఎస్పీ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టిసభా స్థలిని పరిశీలించిన అనంతరం వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన ప్రాంతాలను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. వివిధ రకాల వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించి, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సభకు వచ్చే వాహనాలు క్రమబద్ధంగా పార్కింగ్ చేసేలా మార్గాలను ముందుగానే గుర్తించాలని సూచించారు. రహదారుల అభివృద్ధి, సభా స్థలికి సంబంధించిన మౌలిక వసతుల పనులను ఆర్అండ్‌బీ అధికారులు రూపొందించిన ప్రణాళిక ప్రకారం వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, రాకపోకలకు అనుకూలమైన మార్గాలు, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణీత సమయానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, ఆర్డీఓలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# దిండి మండల సర్వసభ్య సమావేశం



.అరుణ ప్రభ, దిండి ,సెప్టెంబర్ 26,శనివారం ,దిండి మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి కమలాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశాన్ని ఎంపీడీవో వేజన్న తహసిల్దార్ శ్రీనివాస్ గౌడ్ అనుసంధానించారు.ప్రధానంగా విద్యుత్ సమస్యపై పలువురు సర్పంచులు మాట్లాడుతూ, విద్యుత్తు సరఫరా సక్రమంగా లేదని, విద్యుత్ ఏ ఈ సమావేశాలకు రావడంలేదని, సమస్యలపై స్పందించడం లేదని, సర్పంచులు చింతలపూడి భాస్కర్ రెడ్డి (శాంతి గూడెం) రేఖ నాయక్ నాయక్( దేవతపల్లి తండా) రవి( డిండి) విష్ణువర్ధన్ రెడ్డి (ఎర్రగుంటపల్లి )కృష్ణయ్య( తవకళాపూర్) వెంకట్ రామ్( కుందేలు బావి తండా) తదితరులు విద్యుత్ సమస్యను, ఏఈ నిర్లక్ష్యాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ ఏ ఈ అందుబాటులో లేరని, సోమవారము నిర్వహించే ప్రజావాణి లో ఏఈని సర్పంచులతో మాట్లాడిస్తామని ప్రత్యేక అధికారి సర్ది చెప్పడంతో సర్పంచులు శాంతించారు. సమావేశం ముగింపులో స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ, పాఠశాలలకు, అంగన్వాడీలకు, గ్రామపంచాయతీ భవనాలకు నూతన భవన నిర్మాణాలకు స్థలాలను గుర్తించాలని తాసిల్దార్ కు సూచించారు.సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసు జారీ చేయాలని ఎంపీడీవో ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్ గౌడ్, మండల విద్యాధికారి నరసింహ, ఎంపీ ఓ జంగయ్య ,ఏపీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి రెహనా, పంచాయతీ ఇంజనీర్, ఇరిగేషన్ ,హెల్త్ ఆఫీసర్, ఐసిడిఎస్ సూపర్వైజర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ,సోషల్ వెల్ఫేర్ వార్డెన్ తదితర శాఖల అధికారులు పాల్గొని తమకు శాఖకు సంబంధించిన విషయాలను సమీక్షించాలి.ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



## కొండాపూర్ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో

# ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

## శ్రీ గణపతి మహిళా స్వశక్తి సంఘం

శేరిలింగంపల్లి: సెప్టెంబరు 26 (అరుణప్రభ) : శేరిలింగంపల్లి పరిధిలోని రాఘవేంద్ర కాలనీ సి–బ్లాక్‌లో కేఆర్ఆర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించి గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఉత్సవాల్లో కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందారు.ఉత్సవ సమితి సభ్యులు:కే. నిర్మల, కే. శత కుమారి, కే. కుమారి, ఏ. శిల్ప, సువర్ణ, బిక్షమయ్య, నారాయణ రెడ్డి, సుధ, కవిత. మాదుగాత్రి. ఎం. శ్రీనివాస్, సరస్వతి. ప్రముఖులు: చాంద్ బాషా, జగదీశ్వర్ గౌడ్, మారబోయిన రవి యాదవ్, యాంకర్ ప్రదీప్, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు.



## దిండి సర్పంచుల ఫోరం అధ్యక్షులు భాస్కర్‌రెడ్డికి సన్మానం

అరుణ ప్రభ, డిండి, సెప్టెంబర్ 26 ,దిండి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు శాంతి గూడెం సర్పంచ్ చింతలపూడి భాస్కర్ రెడ్డి ఇటీవల సర్పంచుల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన సందర్భంలో ,మండల సర్పంచులు ,కార్యద ర్శులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి ,మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సన్మానం చేశారు.ఈ సందర్భంలో భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని సర్పంచ ్లకు, ఏ ఇబ్బంది వచ్చినా, ఎటువంటి సమస్యలు ఉన్న తన వంతు పరిష్కారం చేస్తానని ,అందర్నీ సమన్వయం చేస్తూ సమస్యల పరిష్కారానికి మండలంలో గాని ,జిల్లా స్థాయి లో గాని, రాష్ట్ర స్థాయిలో గాని తన వంతు పాత్రను నిర్వహిస్తానని ఆయన తెలిపారు.



## ప్రధాన కుడలిలో గ్రీన్ స్పాట్లుగా అభివృద్ధి

విశాఖపట్నం అరుణ ప్రభ... నగరంలో పారిశుద్ధ్యం బక్కగా నిర్వహణ చేసేలా సిబ్బంది చర్యలు చేపట్టారు. 29వ వార్డు సెంచరీ క్లబ్ నవటల్ హోటల్ వెనుక భాగంలో రహదారిపై చెత్తాచెదారం స్థానికులు వేస్తుండగా కొంపుకొట్టేది. దీనిని గమనించిన ఎస్ ఎస్ మేడం నీలిమ శానిటేషన్ సిబ్బంది కలిసి ఆ ప్రాంతాన్ని గ్రీన్ స్పాట్గా పరిగణించి అభివృద్ధి చేపట్టారు. స్థానికంగా మొక్కలు ఏర్పాటు చేసి ముగ్గులు వేసి అందంగా తీర్చిదిద్దడంతో స్థానికులు ఇక అక్కడ చెత్త వెయ్యము అంటూ తెలిపారు. చెత్త చదరం తీసుకెళ్లేందుకు వాహనాలు వస్తున్నాయని ప్రతి వాహనానికి ప్రతి ఇంటి వ్యక్తి బాధ్యతగా అందించాలని ఎస్ ఎస్ నీలిమ సూచించారు. శానిటేషన్ పై సమస్యలు ఉంటే తనకు నేరుగా ఫోన్ చేయాలని సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటారని అన్నారు



## ఆత్మగౌరవ పోరాటానికి చాకలి ఐలమ్మ చిరస్మరణీయం

### గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా జయంతి ఉత్సవాలు

గజ్వేల్, అరుణ ప్రభ : గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సామాజిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనిత అబ్రహం మాట్లాడుతూ.. సామాన్య మహిళగా ప్రారంభమైన చాకలి ఐలమ్మ జీవితం మహిళా ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. ఆమె పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని, విద్యార్థినులు ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని తెలంగాణ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. చరిత్ర అధ్యాపకులు డాక్టర్ పి. జయరాజు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సామాన్య ప్రజలు పోరాడేందుకు ఐలమ్మ పోరాటం స్ఫూర్తినిచ్చిందన్నారు. ఎకనామిక్స్ అధ్యాపకురాలు డాక్టర్ కస్తూరిబాయి మాట్లాడుతూ.. ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం నేటి యువతకు ఆదర్శమని, విద్యార్థినులు ఆమె స్ఫూర్తితో స్వయం ఆధారితంగా ఎదగాలని ఆకాంక్షించారు. పాలనా శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి. మురళీధర్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ శ్రీమతి కమల క్రిస్టియన్, డాక్టర్ జె. ఉమారాణి, ఐక్యూఏసీ కన్వీనర్ శ్రీమతి ఎం.ఎం. లక్ష్మి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిదాయకం : కలెక్టర్ సి. నారాయణరెడ్డి

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమం బలోపేతమైందని, తద్వారా లక్షలాది ఎకరాల భూమి పేద ప్రజలకు పంపిణీ అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వంటి మహనీయుల సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. 1895లో జన్మించి 1985లో మరణించిన వీరనారి చాకలి ఐలమ్మ తన జీవితంలో అనేక కష్టాలను, అణచివేతలను ఎదుర్కొని ప్రజల కోసం పోరాడారని తెలిపారు. పాలకుర్తి ప్రాంతంలో కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేస్తూ, తన పంటను దోపిడీ చేసేందుకు ప్రయత్నించిన దొరల ఎదుట ధైర్యంగా నిలబడి తన హక్కుల కోసం పోరాడిన వీరవనితగా ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మాత్రమే కాకుండా, నేటి తరానికి దిక్సూచిగా నిలిచిన స్ఫూర్తిదాత అని మల్లేష్ యాదవ్ కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తితో యువత తప్పుడు మార్గాలకు దూరంగా ఉండి, సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు, సమావేశాలు



నిర్వహిస్తూ సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిష్ సింగ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేసు రామ్, రజక సంఘం నాయకులు అజయ్, దశరథ్, శ్రీరాములు, వడ్డెర సంఘం నాయకులు వరికుప్పల సుధాకర్, బీసీ వెల్ఫేర్ హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, బీసీ సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండ ఆంజనేయులు, బీసీ సంఘం నాయకులు అచ్చన నరసింహ, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ ఘటనను రాజకీయం చేయడం సరికాదు

## విద్యార్థుల సమస్యలపై నిజంగా శ్రద్ధ ఉంటే గేటు ముందు ధర్నా చేసేవారా? : కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోగు శ్రీనివాస్

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి: సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులను ఎలుకలు కరిచిన ఘటనపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాస్టల్ ఎదుట ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందని పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్ అన్నారు. చిన్న ఘటనను రాజకీయ అంశంగా మార్చడం సరికాదని పేర్కొన్నారు. హాస్టల్‌లోకి వెళ్లేందుకు అనుమతి లేదంటూ గేటు ముందు ధర్నా చేయడం సరికాదని, విద్యార్థుల సమస్యలపై నిజంగా శ్రద్ధ ఉన్నవారు వారి బాధలను అర్థం చేసుకుని పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం తగదని పోగు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనగామ డీసీసీ జిల్లా అధికార ప్రతినిధి, ఉస్మానియా ఉద్యమకారుడు డాక్టర్ నరేందర్ పవర్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ పాలనలో సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను ఏనాడూ సందర్శించిన దాఖలాలు లేవని విమర్శించారు. ప్రస్తుతం రాజకీయ ప్రయోజనాల కోసం హాస్టల్ ఎదుట ధర్నా చేయడం సమంజసం కాదని అన్నారు. విద్యార్థుల సమస్యలు ఉంటే వాటిని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని, రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం వల్ల విద్యార్థులకు ప్రయోజనం ఉండదని కాంగ్రెస్ నాయకులు



పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ ఏటీఎం చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు మార్కెట్ చైర్మన్ లావుడియా మంజుల భాస్కర్ మాజీ దేవస్థానం చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి కమ్మగాని నాగయ్య పెనుగొండ రమేష్ ఎక్స్ ఎంపీపీ యాక సోమయ్య ఆదినారాయణ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కారుపోతుల శ్రీనివాస్ సర్పంచుల బేతి కుమారస్వామి బొడిగె ప్రదీప్ కుమార్ ఈరవెన్ను సర్పంచ్ కుమారస్వామి మాజీ దేవస్థానం చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి గుగులోత్ కిషన్ మండల నాయకులు జిల్లా నాయకులు గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు

# దేశభక్తి గీతాలతో మార్మోగిన బృంద గానాల పోటీ

## బృంద గానాలతో జాతీయ భావాన్ని చాటిన విద్యార్థులు

## భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా బృంద గానాల పోటీ

## బృంద గాన పోటీల్లో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు ప్రధానం

అరుణప్రభ 26 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : భారత్ వికాస్ పరిషత్ మానుకోట శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ వి ఎం ఫంక్షన్ హాల్లో, భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షులు ఒబిలిశెట్టి రామకృష్ణ అధ్యక్షతన జాతీయ బృందా గీతాల పోటీలను నిర్వహించటం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి ఆరుద్ర వెంకటేశ్వర్లు వాసవి మాత కార్పొరేషన్ చైర్మన్ ఇమ్మడి కృష్ణమూర్తి కార్యదర్శి మాలే శ్రవణ్ జీకే దివ్య యాత్ర చైర్మన్ రేణిగుంట్ల గణేష్ కృష్ణ భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేందర్ భారత్ వికాస్ పరిషత్ సౌత్ రీజన్ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నడిపించటం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో 10 పాఠశాలల నూట ఇరవై మంది విద్యార్థినీ, విద్యార్థులతో జాతీయ బృంద గీతాల పోటీలను చాలా అట్టహాసంగా నిర్వహించడం జరిగినది. దీనిలో సంస్కృతము - హిందీ, తెలుగు -జానపద గీతాలను ఆలకించటం జరిగినది, అలాగే ఈ సంవత్సరము వందేమాతరం రచయించి 150 సంవత్సరం సందర్భంగా వందేమాతరం ఫుల్ సాంగ్ ని నాలుగు పాఠశాలల విద్యార్థులు పాడడం జరిగినది వందేమాతరం ఫుల్ సాంగ్ పాటగాను ఫస్ట్ ప్రైజ్ మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే పాఠశాలకు, సెకండ్ ప్రైజ్ శ్రీ చైతన్య (2), స్కూలుకు, మూడో ప్రైజు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కు రావడం జరిగింది హిందీ మరియు సంస్కృత పాటకు మొదటి ప్రైజ్ మాత్మ గాంధీ జ్యోతిరావు పూలే పాఠశాలకు, రెండవ ప్రైజ్ తక్షశిల పాఠశాలకు,



మూడవ ప్రైస్ శ్రీ చైతన్య స్కూలు (1) కి అలాగే ఫోక్ - తెలుగు పాటకు మొదటి ప్రైజ్ మాత్మ గాంధీ జ్యోతిరావు పూలే, రెండవ ప్రైజ్ పానిని హైస్కూల్ కు, మూడో ఫైజు గీతాంజలి పాఠశాలకు రావటం జరిగింది. స్పెషల్ ప్రైస్ జాతీయ పాటకు జిల్లా పరిషత్ గర్ల్స్ హై స్కూల్ కు రావడం జరిగినది. వీరందరికీ ముఖ్య అతిధులు అతిధులచే సర్టిఫికెట్ మెమోంటో ఇవ్వడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ కార్యదర్శి ప్రకాష్ లోయ, వైస్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాసు, కోశాధికారి రేనుకుంట్ల గణేష్, భారత్ వికాస్ పరిషత్ సీనియర్ మెంబర్స్ విశ్వనాథం నరేందర్ రెడ్డి పూనం మాల్పాన్ని జానకిరామ్ మహిళా మెంబర్లు లలిత, కవిత, పద్మ, పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు మరియు విద్యార్థినిలు, విద్యార్థులు, వాసవి మాత కార్పొరేషన్ మెంబర్లు, ఎస్ వి ఎం ఫంక్షన్ హాల్ యాజమాన్యం భవిరిశెట్టి శ్రీనివాస్ పాల్గొనడం జరిగినది

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శం : జిల్లా ఎస్పీ డా. శబరీష్

## మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



అరుణప్రభ 26 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ వీరవనిత, రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్. పి, ఐపీఎస్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సామాజిక అన్యాయాన్ని, పెత్తందారీ దోపిడీని ఎదిరిస్తూ చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట పటిమ తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా తన హక్కుల కోసం పోరాడిన ఆమె స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. మహిళా చైతన్యం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం ఎంతో గొప్పదని ఎస్పీ అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకోవడం మాత్రమే కాకుండా, సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలవడం ద్వారా ఆ ఆశయాలను ఆచరణలో కొనసాగించాలని సూచించారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె త్యాగాన్ని, ధైర్యాన్ని స్మరించుకుంటూ ప్రజాసేవలో మరింత అంకితభావంతో పనిచేయడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని ఎస్పీ డా. శబరీష్. పి, ఐపీఎస్ అన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.



# ఇబ్రహీంపట్నం జోనల్ లెవెల్ ఓవరల్ ఛాంపియన్స్ ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్

## చదువులతో పాటు క్రీడలలో రాణిస్తున్న విద్యార్థులకు అభినందనలు ప్రిన్సిపాల్ బాలాజీ

## జాతీయస్థాయి కబడ్డీ, హ్యాండ్ బాల్, లోగోల్డ్ మెడల్‌లు సాధించిన మా క్రీడాకారులు పిడి వినయ్ కుమార్

అరుణప్రభ ప్రతినిధి ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం లో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ లో ఉన్న విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారు. గత ఐదు సంవత్సరాల నుండి ఇబ్రహీంపట్నం జోనల్ లెవెల్ లో ఛాంపియన్స్ గా నిలుస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ జిల్లా రాష్ట్ర జాతీయస్థాయిలో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, హ్యాండ్ బాల్, నెట్ బాల్, క్రికెట్, అథ్లెటిక్స్ లో జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో అద్భుతమైనటువంటి ప్రదర్శన కనబరిచి నా క్రీడాకారులు చందు, చరణ్, సిద్దు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా పిడి వినయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విజయాల బాటలో ముందు నడుస్తున్న అనేక సార్లు జిల్లాస్థాయిలో మొదటి బహుమతులు సాధించిన ఘనత మాకుంది. నా లక్ష్యం విద్యార్థులను ఒలంపిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించడం, క్రీడలలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి అద్భుతమైన ఫలితాలను సాధించడానికి నా ప్రయత్నం ఎప్పటికీ ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రిన్సిపల్ బాలాజీ మాట్లాడుతూ మా విద్యార్థులు చదువులలో జేఈఈ ఐ ఐ టి అడ్వాన్స్ లో మా ఇద్దరు విద్యార్థులు సీట్లు సాధించినారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడలలో కూడా రాణిస్తున్నాము. పదవ తరగతి ఇంటర్ ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించాము భవిష్యత్తులో కూడా ఇలాంటి ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తపరిచారు. విద్యార్థులలో భావి భవిత పౌరులుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని ఈ సందర్భంగా తెలిపారు..



## మైనారిటీ మహిళలకు ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని బాలసదనం వేదికగా ఈరోజు మైనారిటీ మహిళలకు ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లిగౌరవ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్ గారు, గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శేట్కర్ గారులి హాజరై లబ్ధిదారులకు ఇందిరమ్మ కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి, తమ కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకుని మహిళలు ఇంటి వద్దనే ఉపాధి పొందుతూ తమ కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్,మున్సిపల్ కౌన్సిలర్లు,మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మైనారిటీ మహిళలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## శివమ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

గజ్వేల్ అరుణ ప్రభ : జగదేవపూర్: మండల కేంద్రంలోని బొడ్రాయి వద్ద శివాలయం సమీపంలో శివమ్ యూత్ జగదేవపూర్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం సంప్రదాయంగా మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న శివమ్ యూత్ సభ్యులు ఈ ఏడాది కూడా మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం వినాయకుడిని ప్రత్యేకంగా రాధాకృష్ణ అవతారంలో రూపొందించి భక్తులను ఆకట్టుకునేలా ప్రదర్శించారు. శివమ్ యూత్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ఇది 14వ సంవత్సరం. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తూ ప్రజల్లో పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నామని యూత్ సభ్యులు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేఖరరెడ్డి, వెంకట్ రెడ్డి,సంతోష్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,రాజేష్, భాను, హరీష్ రెడ్డి, సతీష్ రెడ్డి, రవికిరణ్ రెడ్డి, శ్రీను, శ్రీధర్, శివ,నిఖిల్, లోకేష్ తదితర శివమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మకు వంటేరు ప్రతాప్‌రెడ్డి నివాళి

### ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

### ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్,అరుణ ప్రభ : వీరనారి చాకలి చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఐలమ్మ విగ్రహానికి గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రజక సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.



## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్ కసరత్తు

### ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### నేతలకు పిలుపునిచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అరుణప్రభ 26 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : తెలంగాణ భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశం నిర్వహించిన బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ ప్రతినిధులతో కలసి పాల్గొన్న మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు కవిత మాలోత్

# ఘనంగా ప్రపంచ పర్యటక దినోత్సవం: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



అరుణప్రభ 26 సెప్టెంబర్ మహబూబాబాద్ : అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ మండలం, కంబాలపల్లి పెద్ద చెరువు వద్ద జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కి గ్రామ ప్రజలు కోలాటం, చిరుతల రామాయణం, బతుకమ్మలు, బోనాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఘనంగా స్వాగతం పలికారు పురాతన శివాలయంను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు చెరువు ప్రాంగణంలో మొక్క నాటి నీరు పోశారు, జిల్లాలోని పర్యటక ప్రదేశాలపై పాఠశాల విద్యార్థులు వేసిన పెయింటింగ్, ఫోటో ఎగ్జిబిషన్ ను సందర్శించారు అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోనీ కురవి వీరభద్ర స్వామి ఆలయం, కందికొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, వెంకటేశ్వర ఆలయం నరసింహులపేట, బయ్యారం పెద్ద చెరువు, మత్తడి, అనంతరం, భీముని పాదం, గుంజేడు ముసలమ్మ తల్లి ఆలయం, పురాతనమైన ఆలయాలు ఏడు బావులు, కంబాలపల్లి పెద్ద చెరువు, గ్రీన్ హిల్స్ క్యాంపింగ్, పులిమడుగు క్యాంపింగ్, బయ్యారం జలపాతం, పర్యటక ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్య చర్యలతో ముందుకు సాగుతున్నామని, జిల్లాలోని పర్యటక ప్రదేశాలను విస్తృత ప్రచారం గావించుటకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్ఫ్లెన్సర్స్ , జిల్లాకు చెందిన సినీ ప్రముఖులు, టీచర్స్, కవులు, రచయితలు, ప్రజా ప్రతినిధులు,యూట్యూబర్స్, జిల్లాలోని ప్రజలు ప్రముఖులు, విద్యార్థినీ, విద్యార్థులు ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలని పర్యటక ప్రదేశాల ద్వారా గ్రామాలు జిల్లా అభివృద్ధి చెందుతుందని, జిల్లాలో 49 శాతం అడవి ఉందని అందులో ఎంతో అద్భుతమైన టూరిజం స్పాట్స్ ఉన్నాయని, కల్చర్, టెంపుల్ , ఎకో, అన్ని రకాల టూరిజం మన జిల్లాలో కలదని, ప్రతి ఒక్కరూ ఆ విషయాలపై ప్రమోట్ చేయాలన్నారు, కల్చర్ పై క్లుప్తంగా బుక్కు రాసిన రమేష్ ని అభినందించారు పర్యాటక ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్లాస్టిక్ రహిత ప్రదేశాలుగా తీర్చిదిద్దుటకు ప్రతి ఒక్కరూ బాధ్యత యుతంగా కృషి చేయాలని సూచించారు, పర్యటక రంగం అభివృద్ధి చెందుతే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని తద్వారా జిల్లా ఆర్థికంగా స్థిరంగా ఉంటుందన్నారు, ప్రపంచంలోని కొన్ని దేశాలు, మనదేశంలోని నార్త్ ఈస్ట్ లలో గోవా, మేఘాలయ, అస్సాం, తదితర ప్రదేశాలు కేవలం టూరిజం పై ఆధారపడి ఉంటుందని అక్కడి స్థానిక ప్రజలు పర్యటక ప్రాంతాలను, ఓన్ చేసుకుని అటవీ ప్రాంతాలను కఠిన నిబంధనలతో సంరక్షించుకుంటారన్నారు, ఏ విధంగా అయినా ప్రకృతికి విగాథం కలిగించకుండా నిబంధనలు పెట్టుకుంటారన్నారు, అదే స్ఫూర్తితో మన జిల్లాలో కూడా సర్పంచులు, ఫారెస్ట్ అధికారులు, టూరిజం నోడల్ అధికారి, బాధ్యతాయుతమైన టూరిజంను పెంపొందించడం కోసం కృషి చేయాలన్నారు పాఠశాలలలో యువ టూరిజం క్లబ్బులను ఏర్పాటు చేయడం జరిగింది అందులో చర్చించుకుని జిల్లాలోని టూరిజం ప్రదేశాలను ప్రమోట్ చేయాలన్నారు, జిల్లాలో ఉన్న పర్యటక ప్రదేశాలను పూర్తిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో సందర్శించాలని కానీ తగిన నిబంధనలు పాటిస్తూ సొంత వస్తువులను తీసుకువెళ్లాలని ప్లాస్టిక్స్ నివారణ కచ్చితంగా పాటించాలని, పిల్లలు మీరు అలవాటు చేసుకుని ఇతరులకు చెప్పాలని సూచించారు, ఇంత పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విజయవంతం చేసిన టూరిజం నోడల్ అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ఇన్చార్జి లోకల్ బాడీ పురుషోత్తం, ఫారెస్ట్ డివిజనల్ అధికారి వెంకటేశ్వర్లను, స్థానిక గ్రామ సర్పంచ్, ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటలో కీలక భూమిక పోషించిన తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులను, స్థానిక గ్రామ కళాకారులను, విద్యార్థినీ, విద్యార్థులను, సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన వివిధ పాఠశాలల పిల్లలను గ్రామ కళాకారులను, శాలువా మెమొంటోతో సత్కరించారు ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, జిల్లా అధికారులు, స్థానిక సర్పంచ్ చిరకా వసంత –ఉపేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ కమటం యాకన్న, గ్రామ ప్రజలు ప్రజలు కె.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అభిలాష్, తదితరులు పాల్గొన్నారు

# కేసముద్రం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా.శబరీష్

## సిబ్బంది విధులు, గ్రామాల సందర్శనలు, రాత్రి గస్తీపై ఆరా
## ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ మెరుగైన పోలీస్ సేవలు అందించాలి: ఎస్పీ డా. శబరీష్



అరుణప్రభ 26 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ కేసముద్రం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు మరియు ప్రజలకు అందుతున్న పోలీస్ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ పోలీస్ స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎస్ఐ క్రాంతి కిరణ్‌తో స్టేషన్ సిబ్బంది విధుల కేటాయింపు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందితో నేరుగా మాట్లాడిన ఎస్పీ వారి రోజువారీ విధులు, గ్రామాల సందర్శనలు, బీట్ విధులు, వీపీఓ (విలేజ్ పోలీస్ ఆఫీసర్ ) విధుల నిర్వహణ, గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, రాత్రి గస్తీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సిబ్బంది తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ స్థానిక సమస్యలు, నేర ప్రవృత్తులు మరియు అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించాలని సూచించారు. వీపీఓ లు తమకు కేటాయించిన గ్రామాల్లో నిరంతరం అందుబాటులో ఉంటూ, గ్రామస్థులతో సమన్వయం పెంచుకోవాలని, గ్రామంలో జరిగే ముఖ్యమైన పరిణామాలు, నేరాలకు సంబంధించిన సమాచారం మరియు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్పీ ఆదేశించారు. రాత్రి గస్తీని మరింత పటిష్టం చేసి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. డయల్ 112కు వచ్చే అత్యవసర కాల్స్‌పై సిబ్బంది తక్షణమే స్పందించి, బాధితులకు వేగంగా పోలీస్ సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం మరియు వినియోగంపై నిఘా పెంచి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు గ్రామస్థాయిలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలను కలిసే సమయాన్ని (విజిటింగ్ అవర్స్ ) తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. ఈ సమయంలో ప్రజల సమస్యలను ఓపికగా విని, ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, అతివేగం మరియు ట్రాఫిక్ నిబంధనలపై గ్రామాలు, విద్యాసంస్థలు మరియు ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నియమాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పోలీస్––ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా పోలీసులకు తెలియజేసే విధంగా నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందన అందిస్తూ బాధితులకు మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు నిరంతరం అప్రమత్తంగా ఉండి, విధుల్లో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరును ప్రదర్శించాలని ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సిబ్బందికి సూచించారు.

# వీబీజీ రాంజీ పథకం, ఎల్నీనో పై గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శిలకు శిక్షణ కార్యక్రమం



అరుణప్రభ 26 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : వి బి జి రామ్ జి పథకం గురించి ఎల్ నీ నో గురించి గ్రామపంచాయతీ సర్పంచులకు కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం మానుకోట జిల్లా కేంద్రంలోని స్థానిక పిఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించగా ముఖ్య అతిథులు ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, జిల్లా కలెక్టర్, స్నేహ శబరిష్, మాట్లాడరు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పీడీ, పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిఏఓ రేవంత్, అడిషనల్ డిఆర్డిఓ, మల్లీశ్వరి, పి ఆర్ ఈ ఈ, తదితరులు పాల్గొనగా కార్యక్రమంను ఉద్దేశించి ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్‌లి మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్నీనో ప్రభావం వల్ల జిల్లాలో విబిజి రామ్ జీ పథకంలో భాగంగా నీటిని జాగ్రత్తగా వినియోగించుకుంటూ పంటలు సాగు చేయాలని, భూగర్భ జలాలను పెంపొందించుకునే విధంగా క్షేత్రస్థాయిలో రైతులకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు, ఇప్పటికే వివిధ రకాల ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని అన్నారు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌లి మాట్లాడుతూ జిల్లాలోనీ గంగారం, కొత్తగూడ మండలలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని, అందుకు అనుగుణంగా గ్రామస్థాయిలో యాక్షన్ ప్లాంట్ ప్రకారం సాగర్ అన్నారు, వికసిత్ గ్రామ పంచాయతీ నిధుల వినియోగించుకొని స్థానిక వనరుల ద్వారా డెయిరీ ఫామ్, యూనిట్స్, ఉద్యాన పంటలు కూరగాయలు, పండ్లు, పండించాలన్నారు, వీటి వినియోగం ఇతర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకుంటున్నా నేపథ్యంలో, వీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు, వికసిద్భారత్ 375 పనుల నుండి సిసి రోడ్లు, డ్రైన్లు, తదితర గ్రామస్థాయి పనులను వినియోగించుకోవాలన్నారు, భాగస్వామ్య గ్రామీణ అభివృద్ధి పథకం ద్వారా అందరూ సమన్వయంతో కలిసి పనులు చేపట్టాలన్నారు, వి బి జి రామ్ పథకంలో భాగంగా భూగర్భ జలాలను పెంపొందించుకునే కార్యక్రమాలను జిల్లాలో చేపట్టాలని కలెక్టర్ సూచించారు అందుకు పంచాయతీ కార్యదర్శిలు, సర్పంచులు బాధ్యతాయుతంగా పరస్పర సహకారంతో పనిచేయాలని తెలిపారు.

# మీసేవ ప్రారంభోత్సవంలో పాల్గొన్న చైర్‌పర్సన్ జ్యోతి రమేష్‌నాయక్



అరుణప్రభ 26 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ పట్టణంలో నూతనంగా తహసీల్దార్ నందు ఏర్పాటు చేసిన మీసేవ, ఆధార్ నమోదు కేంద్రంను ప్రారంభోత్సవ కార్యక్రమంలో లిమహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గూగులోత్ జ్యోతి రమేష్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీసేవ కేంద్రాన్ని ప్రారంభించి, మీసేవ యజమాన్యాన్నికి అభినందనలు తెలియజేశారు ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువగా తీసుకురావడంలో మీసేవ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జ్యోతి రమేష్ నాయక్ గారు పేర్కొన్నారు. ప్రజలు వివిధ ప్రభుత్వ సేవలు, ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన సేవలను సులభంగా పొందేందుకు మీసేవ కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా మీసేవ కేంద్రం నిర్వాహ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. పట్టణ




ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు సులభంగా అందుబాటులో ఉంటాయని మీయొక్క దరఖాస్తుల సమస్యల పరిష్కారం వెంటనే మీ సేవలో పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ అజయ్ సారధి గారు, 28వ వార్డు కౌన్సిలర్ గోళ్ల రాజు 27వ వార్డు కౌన్సిలర్ నిమ్మల మాధవి శ్రీను రెవెన్యూ ఎమ్మార్వో మీసేవ నిర్వాహకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## ఎన్‌జీఆర్ఐ, ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించిన గజ్వేల్ డిగ్రీ విద్యార్థులు

గజ్వేల్ అరుణ ప్రభ : గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ (అటానమస్), గజ్వేల్‌కు చెందిన బీఎస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్––నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)ను ఓపెన్ డే సందర్భంగా సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ సహకారంతో నిర్వహించిన ఈ విద్యా పర్యటనలో కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. అలివేలు విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఎన్‌జీఆర్ఐలోని వివిధ పరిశోధనా విభాగాలు, ఆధునిక ప్రయోగశాలలు, శాస్త్రీయ పరికరాలను విద్యార్థులు పరిశీలించారు. శాస్త్రవేత్తలు, సబ్జెక్ట్ నిపుణులు, పరిశోధక విద్యార్థులతో సంభాషిస్తూ పరిశోధనా పద్ధతులు, ఆధునిక విశ్లేషణా సాంకేతికతలు, వాటి అనువర్తనాలపై అవగాహన పొందారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగాన్ని సందర్శించి ప్రయోగశాలలను పరిశీలించారు. అధ్యాపకులు, విద్యార్థులతో చర్చించి ఉన్నత విద్య, పరిశోధన అవకాశాలపై సమాచారం తెలుసుకున్నారు. తరగతి గది అభ్యాసానికి మించి ప్రత్యక్ష శాస్త్రీయ అనుభవాన్ని అందించిన ఈ పర్యటన విద్యార్థుల్లో పరిశోధన, ఉన్నత విద్య, అంతరశాఖా శాస్త్రాలపై ఆసక్తిని పెంపొందించిందని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి.



## వీరనారికి నివాళులు

మహేశ్వరం నియోజకవర్గం బడంపేట్సర్కిల్(అరుణప్రభ న్యూస్ 26)తెలంగాణ వీరనారి బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక చాకలి (చిట్యాల) ఐలమ్మ 131వ జయంతి వేడుకలు ఈరోజు రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన చిట్యాల ఐలమ్మ గారి జయంతి వేడుకలలో లిరంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఇతర సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో మాట్లాడుతూ... భూస్వాముల అణచివేతకు, రజాకార్ల, జమీందారుల,పెత్తందారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గుండెల్లో ధైర్యంతో ఎదురు నిలబడి భూమి కోసం,భుక్తి, నిజం పాలన విముక్తి కోసం కోసం పోరాడిన ధీశాలి ఐలమ్మ గారని, ఆమె పోరాట పటిమ నేటి తరానికి, ముఖ్యంగా మహిళా లోకానికి ఎప్పటికీ మార్గదర్శకం, గొప్ప స్ఫూర్తిదాయకం అని అన్నారు.

## ప్రయాణం ప్రాణభయంతో



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్పేట్ సర్కిల్ (అరుణ ప్రభ న్యూస్ 26)గుర్రంగూడ–నాదర్గుల్ ప్రధాన రహదారి సాయి దుర్గా నగర్ కాలనీ వద్ద మాన్ హోల్ తో ప్రజల ఎంతో ఇబ్బంది పడుతున్నారు కొన్నిసార్లు ప్రమాదాలు కూడా జరిగాయి దీనిని ఎన్ని సార్లు రిపేర్ చేసిన తిరిగి రెండు మూడు రోజుల్లో అదే పరిస్థితి,ప్రజాధనం వృధా అవుతుంది కానీ సమస్య తీరట్లేదు ప్రయాణికులు ప్రజలు అవస్థలు పడుతున్నారు కావున ఈ సారి పర్మనెంట్ గా స్టీల్ మాన్ హోల్ కవర్ తో బాగుచేయాలని త్వరితగతిన మున్సిపల్ అధికారులు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## తెలంగాణ పోరాట యోధురాలు ఐలమ్మ

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్పేట్ సర్కిల్ (అరుణ ప్రభ న్యూస్ 26)చిట్యాల ఐలమ్మ జయంతి గారి సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్పేట్ సర్కిల్ జిల్లెలగూడ చందనచెరువు కట్టపై చాకలి ఐలమ్మ గారి విగ్రహం వద్ద సంఘం పెద్దలు మరియు బిజెపి నాయకులు క్లస్టర్– 2 అధ్యక్షులు ముఖేష్ ముదిరాజ్ గారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని పూలమాలవేసి ఘన నివాళులు అర్పించిన నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జ్ శ్రీ అందేలా శ్రీరాములు యాదవ్ అన్న గారు నిజాం నిరంకుశత్వం పోకడలను ఎండగట్టి బానిస బతుకు నుంచి విముక్తి కోసం నిజాం నవాబులను రజాకార్లను జమీందారులను ఎదురొడ్డి నిలిచిన వీర నారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు ఈ కార్యక్రమంలో ఇతర ప్రముఖులు వంటేరు నర్సింహ్మా రెడ్డి , జజుల మల్లారెడ్డి ూ ఆంజనేయులు ఖ నాగేశ్వర్ రావు , ప్రసాద్ రెడ్డి , గాజుల మధు , గౌరీశంకర్ , గడ్డం జగన్ , సుల ప్రభాకర్ ,సిద్దాల శ్రీను,కాశిరామ్,సత్తయ్య తదితర నాయకులు పాల్గొన్నారు

# మహబూబాబాద్ పట్టణంలో అక్రమంగా గంజాయి మొక్కలను పెంచుతున్న వ్యక్తి అరెస్ట్

## సుమారు 3000/- విలువ గల రెండు గంజాయి మొక్కలు స్వాధీనం

అరుణప్రభ 26 సెప్టెంబర్ మహబూబాబాద్ : తేదీ. 26.09.2026 రోజున మహబూబాబాద్ టౌన్ పోలీస్ వారికి బాబునాయక్ తండలోని గుగులోత్ మంగిలాల్ అను వ్యక్తి తన ఇంటిలో అక్రమంగా గంజాయి మొక్కలను పెంచుతున్నాడని నమ్మదగిన సమాచారం రాగా, మహబూబాబాద్ టౌన్ పోలీసులు అట్టి ఇంటిని తనిఖీ చేయగా అట్టి ఇంటిలో రెండు గంజాయి మొక్కలను గుర్తించనయినది. మహబూబాబాద్ పట్టణం, బాబునాయక్ తండకు చెందిన గుగులోత్ మంగిలాల్ వా/శీ. కాల్య ఏ తాల్య, వయస్సు: 40 ఎతీం, కులశీ: లంబాడ, వృత్తి: సుతారీ మేస్త్రి, అనునతను అక్రమ మార్గంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని, తన ఇంటిలోని బాత్రూమ్ దగ్గర రెండు గంజాయి మొక్కలను అక్రమంగా పెంచుతున్నాడు. అట్టి గంజాయి మొక్కల విలువ సుమారు 3000/- వరకు ఉంటుంది. అట్టి మొక్కలను స్వాధీనపర్చుకొని, అతనిపై కేసు నమోదు చేయనైనది. మహబూబాబాద్ జిల్లాలో ఎవరైనా గంజాయి అమ్మిన లేదా తాగిన ఆట్టి సమాచారం పోలీస్ వారికి ఇవ్వగలరు



# ఐహెచ్ఆర్‌పీసీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



ధర్మవరం, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలోని బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ (ఐహెచ్ఆర్‌పీసీ) ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. వైద్య సేవలు: బీపీ, షుగర్, రక్తపరీక్షలు, కంటి, దంత, స్త్రీ వైద్య పరీక్షలు, స్కానింగ్, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే, క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మందికి వైద్య సేవలు అందించారు. కిమ్స్ సవీరా ఆసుపత్రి సహకారంతో స్కానింగ్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ తదితర పరీక్షలకు అవసరమైన పరికరాలతో ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 15 మంది వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది సేవలందించారు. ధర్మవరం ప్రజలకు మరింత విస్తృతంగా వైద్య సేవలు అందించేందుకు త్వరలో మరో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఐహెచ్ఆర్‌పీసీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన కిమ్స్ సవీరా ఆసుపత్రి యాజమాన్యం, వైద్య సిబ్బంది, బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఈఓ, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐహెచ్ఆర్‌పీసీ నేషనల్ ప్రెసిడెంట్, వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.డి. ముజాహిద్, ఆర్టీఐ సెల్ నేషనల్ ప్రెసిడెంట్ తాహిర్, నేషనల్ లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జకూరు సుమలత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అభాగ్యులకు అండగా న్యాయ సేవాధికార సంస్థ

## సబ్‌జైలులో విచారణ ఖైదీలతో ప్రధాన జిల్లా న్యాయమూర్తి కె. మురళీ మోహన్ ముఖాముఖి

## "జైలు జీవితం మార్పుకు నాంది కావాలి.. బయటకు వెళ్లే నాటికి ఆదర్శ పౌరులుగా మారాలి"




అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్ 26 : సమాజంలోని బలహీనవర్గాలకు ఉచిత న్యాయసాయం, సత్వర న్యాయం అందించడంలో న్యాయ సేవాధికార సంస్థ అండగా నిలుస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె. మురళీ మోహన్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైలును సందర్శించిన ఆయన విచారణ ఖైదీలతో ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీల హక్కులు, రాజ్యాంగం కల్పించిన రక్షణలు, జైలు జీవితం అనంతరం సమాజంలో గౌరవప్రదంగా జీవించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు.

**"జైల్లో ఉన్నంత మాత్రాన హక్కులు పోవు"**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ను ప్రస్తావిస్తూ.. చట్టం నిర్దేశించిన విధానాన్ని అనుసరించకుండా ఏ వ్యక్తి ప్రాణాన్ని, వ్యక్తిగత స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. జైలులో ఉన్నంత మాత్రాన ప్రాథమిక హక్కులను పూర్తిగా కోల్పోయినట్లు కాదని పేర్కొన్నారు. విచారణ ఖైదీలకు ఆరోగ్యకరమైన ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, స్వచ్ఛమైన వాతావరణం వంటి ప్రాథమిక సౌకర్యాలు పొందే హక్కు ఉందని తెలిపారు.

**ఉచిత న్యాయసాయంపై అపోహలు వద్దు**

ఉచిత న్యాయసాయం అంటే నాణ్యతలో రాజీ పడిన న్యాయసాయం కాదని ఆయన స్పష్టం చేశారు. నిరుపేదలు ఎలాంటి సందేహాలు, భయాలు లేకుండా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని సూచించారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు ఎక్స్‌అఫీషియో చైర్మన్‌గా జిల్లా ప్రధాన న్యాయమూర్తి స్వయంగా న్యాయ సేవల పనితీరును పర్యవేక్షిస్తారని, అర్హులైన వారికి న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

**"జైలు జీవితం మార్పుకు వేదిక కావాలి"**

జైలు జీవితాన్ని కేవలం శిక్షగా భావించకుండా తమలో మార్పు తీసుకురావడానికి ఒక అవకాశంగా ఉపయోగించుకోవాలని న్యాయమూర్తి సూచించారు. గొంగళిపురుగు కొంతకాలం తనను తాను ఒక పరిధిలో బంధించుకుని అనంతరం అందమైన సీతాకోకచిలుకగా బయటకు వచ్చినట్లే, జైలు నుంచి బయటకు వెళ్లే సమయానికి ప్రతి ఒక్కరూ గతాన్ని సమీక్షించుకుని, మంచి ఆలోచనలతో సమాజం మెచ్చే వ్యక్తులుగా మారాలని హితవు పలికారు. అనంతరం ప్రధాన జిల్లా న్యాయమూర్తి సబ్‌జైలులోని బ్యారక్‌లు, వంటగది, సరుకుల నిల్వ గదిని పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు ఈ కార్యక్రమంలో చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి నాగేశ్వరరావు, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజు కృష్ణ, జైలర్ శ్రీనివాస్, పారా లీగల్ వాలంటీర్ రాంప్రభు తదితరులు పాల్గొన్నారు.



# 25వ వార్డులో 40 వీధిదీపాల ఏర్పాటు

ధర్మవరం, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలోని 25వ వార్డులో చీకటిగా ఉన్న ప్రాంతాల్లో టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు సొంత నిధులతో 40 వీధిదీపాలను ఏర్పాటు చేయించారు. రాత్రివేళల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. ఈ విషయాన్ని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సూచనల మేరకు వీధిదీపాలను ఏర్పాటు చేసినట్లు ప్రసాద్‌నాయుడు తెలిపారు. వీధిదీపాలతో రాత్రివేళల్లో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ప్రసాద్‌నాయుడు తెలిపారు.

# నేతన్న సేవా సర్వే పారదర్శకంగా చేపట్టాలి

## అర్హులైన చేనేత కార్మికులందరికీ పథకం వర్తింపజేయాలి

## ఏపీ చేనేత కార్మిక సంఘం డిమాండ్



ధర్మవరం, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : నేతన్న సేవా పథకానికి అర్హులైన చేనేత కార్మికులను గుర్తించే సర్వేను ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ధర్మవరం చేనేత కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కన్వీనర్ జె.వి. రమణ, జిల్లా నాయకులు ఎస్.హెచ్. భాష మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న సర్వేలో అర్హులైన కార్మికులకు అన్యాయం జరగకుండా అధికారులు ఇంటింటికీ వెళ్లి పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరారు. సొంత మగ్గం కాకుండా కూలి మగ్గాలపై పనిచేస్తున్న చేనేత కార్మికులను కూడా పథకంలో చేర్చాలని డిమాండ్ చేశారు. అర్హులైన కార్మికులకు గుర్తింపు కార్డులు, చేనేత పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆగస్టు 30న అర్హులైన కార్మికుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని మంత్రి సవిత ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటికీ అమలు కాలేదని, నగదు జమ చేసే తేదీని ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. కలెక్టర్, ఆర్డీఓ, ఎంపీడీఓలు సర్వేను పర్యవేక్షించి అర్హులైన ప్రతి కార్మికుడికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# నలంద డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రవేశం కొరకు స్పాట్ అడ్మిషన్లు

అరుణప్రభ 26 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మానుకోట జిల్లా కేంద్రంలోని స్థానిక నలంద డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ప్రవేశం కొరకు 28 సెప్టెంబర్ 2026 నుండి 29 సెప్టెంబర్ 2026 వరకు అనగా సోమవారం మరియు మంగళవారం రోజులలో అనగా రెండు రోజులపాటు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ ప్రిన్సిపల్ వై కృష్ణ ప్రసాద్ తెలియజేశారు డిగ్రీల ప్రవేశం పొంది విద్యార్థులు తమ యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్ కళాశాల ప్రిన్సిపల్ ను సంప్రదించగలరు డిగ్రీలో ప్రవేశం కొరకు ఇది చివరి అవకాశం కావున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు అడ్మిషన్ కొరకు సంప్రదించాల్సిన సెల్ నంబర్స్ 99631 56376 మరియు 93470 19203

## జిల్లాస్థాయి యువజనోత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : యువతలోని సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయి యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు యువజన సర్వీసుల శాఖ కార్యనిర్వాహణ అధికారి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. అక్టోబరు 8న కదిరిలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని 15 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. జానపద నృత్యం, జానపద గీతం, పెయింటింగ్, వీధి నాటకం, కవితా రచన విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. జానపద నృత్యం, జానపద గీతం, వీధి నాటకానికి 10 మంది చొప్పున బృందాలుగా పాల్గొనాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో విజేతలకు రాష్ట్ర స్థాయి, అక్కడ విజేతలుగా నిలిచిన వారికి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు తప్పనిసరిగా 'మై భారత్' పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. తమ వివరాలను వాట్సాప్ నంబర్ 9849913062కు పంపాలని, మరిన్ని వివరాలకు 9959517370, 9010786106 నంబర్లలో సంప్రదించాలని రవిశంకర్‌రెడ్డి కోరారు.



## మర్యాదపూర్వకంగా కలిసిన అధ్యక్షురాలు

మహేశ్వరం నియోజకవర్గం బడంపేట్ సర్కిల్ (అరుణ ప్రభ న్యూస్ 26) : మహేశ్వరం మాజీ శాసన సభ్యులు తీగల కృష్ణారెడ్డిని మరియు మాజీగ్రా చైర్ పర్సన్ ఐతీ తీగల అనిత హరినాథ్ రెడ్డి నీ మర్యాదపూర్వకంగా కలిసిన డీసీసీ నూతన అధ్యక్షురాలు చిగురింత పారిజాతనరసింహారెడ్డి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షురాలిగా ఎంపికైన చిగురింత పారిజాత నరసింహారెడ్డి ఈరోజు టీకేఆర్ కాలేజీలో మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత తీగల కృష్ణారెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో రంగారెడ్డి జిల్లాలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై ఇరువురు నేతలు చర్చించారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, కార్యకర్తలను సమాయత్తం చేస్తూ ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి గారు మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధికి, నాయకులందరినీ కలుపుకొని పోయేందుకు తన వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు చిగురింత పారిజాత నరసింహారెడ్డి గారు మాట్లాడుతూ... తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, సీనియర్ నేతమార్గదర్శకత్వంలో జిల్లాలో పార్టీని అగ్రపథంలో నిలిపేందుకు శ్రమిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



ధర్మవరం, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, రిటైర్డ్ డాక్టర్ సంకారపు నరసింహులు వైద్యులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాలిటీ, వివిధ వార్డులను సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ఓపీ సముదాయం, క్యూ కౌంటర్లను పరిశీలించారు. రోగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టోకెన్లు పొందుతున్న తీరును గమనించి ఆసుపత్రి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పోతుకుంట రోడ్డులో నిర్మించిన ఆసుపత్రి సముదాయంలో 50 పడకల మాతా శిశు ఆసుపత్రిని త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీకాంత్, ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ హరి శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు

ధర్మవరం, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సేవాభావం, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని, సమాజ సేవలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ ఫణికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు సూచించారు. మొక్కల పెంపకం, స్వచ్ఛభారత్, పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాఘవేంద్ర, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
ఆదివారం, సెప్టెంబరు 27, 2026

# 104 వాహనాల వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలి



## కొనుగోలు, వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: బీఎస్పీ

ధర్మవరం, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : 104 ఆరోగ్య వాహనాల వ్యవహారంపై ప్రజల్లో నెలకొన్న సందేహాలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీఎస్పీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సాకే వినయ్‌కుమార్ కోరారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 104 వాహనాల కొనుగోలు, రిజిస్ట్రేషన్, నిర్వహణ, ప్రస్తుతం వినియోగంలో ఉన్న వాహనాల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ధర్మవరంతో పాటు జిల్లా వ్యాప్తంగా సేవల్లో ఉన్న వాహనాల వివరాలు, వాటి ఆర్సీ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. గతంలో కొనుగోలు చేసిన వాహనాలే ప్రస్తుతం కొత్తగా ప్రారంభించారనే ప్రచారం జరుగుతోందని, దీనిపై ప్రభుత్వం వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. వాహనాలపై రాజకీయ నాయకుల చిత్రాలు, స్టిక్కర్లకు సంబంధించిన అంశంపైనా అధికారిక వివరణ ఇవ్వాలని అన్నారు. రాజకీయ విమర్శలకు తావులేకుండా 104 వైద్య సేవలు గ్రామీణ ప్రజలకు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని వినయ్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాల్యవంతం రాంప్రసాద్, ధర్మవరం రూరల్ అధ్యక్షుడు వసంతపురం ఆదినారాయణ, రమేష్ పాల్గొన్నారు.

# క్యాన్సర్ నివారణ ప్రకృతి వ్యవసాయంతో సాధ్యం

**ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి**

**జాతీయ మిషన్ ప్రకృతి వ్యవసాయం పై సిఆర్పి లకు శిక్షణ తరగతుల కార్యక్రమంలో పాల్గొన్న లిజిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



అరుణప్రభ 26 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ నియోజకవర్గం కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి జైపాల్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జిల్లాలోని (17) క్లస్టర్లకు గాను (34) సిఆర్పి లకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం జాతీయ మిషన్ నేచరల్ ఫామింగ్ ఆధ్వర్యంలో ప్రారంభం అయ్యింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపే విధంగా వ్యవసాయ ఉద్యానవన శాఖ శాస్త్రవేత్తలు, అధికారులు చర్యలు తీసుకోవాలని, తద్వారా ప్రజలు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని కూరగాయలను తీసుకుని ఆరోగ్యవంతంగా ఉంటారని సూచించారు, ఈరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ,సిబ్బంది కి సేంద్రియ ఎరువుల తయారీ ,వాడకం, ప్రకృతి వ్యవసాయం పై ఘనామృతం, జీవామృతం, బీశామృతం గశపర్ణి కషాయం, నూతన టెక్నాలజీ విధంగా ఎలా తయారు చేయాలి అనే అంశంపై శిక్షణ తరగతులు ఇవ్వడం జరుగుతుందని ,ఇట్లు శిక్షణను తాను స్వయంగా పరిశీలించడం జరిగిందన్నారు, జైపాల్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో అడ్వాన్సుడ్ జీవామృతం తయారుచేసే యూనిట్ను పరిశీలించారు, జిల్లాలో రైతులు సిఆర్పి లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న కార్యక్రమాల ద్వారా సేంద్రియ ఎరువులు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహించి సబ్సిడీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ, అధికారులు విస్తరణ అధికారులు ఉద్యానవన శాఖ, శాస్త్రవేత్తలు, సంబంధిత అన్ని విభాగాల సిబ్బందితో సమన్వయంతో కలిసి పనిచేసి రైతులకు మేలు చేసే విధంగా పక్క ప్రణాళికతో ముందుకు సాగాలని అన్నారు ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, ఉద్యానవన శాఖ అధికారి జి. మరియాన్న, శాస్త్రవేత్త, హెచ్ఓడి మల్యాల ప్రశాంత్, జైపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రామారావు, నాగేశ్వరరావు, స్థానిక తహసిల్దార్ వివేక్, వ్యవసాయ శాఖ ఏవో విస్తరణ అధికారి తదితరులు పాల్గొన్నారు

# ఆదిభట్ల వినాయకుడి లడ్డూ రూ.21 లక్షలు

**హోరాహోరీగా సాగిన వేలం..**

**దక్కించుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి**

ఇబ్రహీంపట్నం: ఆదిభట్లలో బుర్జు మైసమ్మ దేవాలయం, చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ వేలం పాట ఉత్కంఠగా సాగింది. ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి రూ.21 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూ వేలంలో మర్రి నిరంజన్‌రెడ్డి, కోరే జంగయ్య మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. ఒకరిని మించి మరొకరు వేలం పాట పాడటంతో ఉత్కంఠ కొనసాగింది. చివరకు మర్రి నిరంజన్‌రెడ్డి రూ.21 లక్షల ధరకు లడ్డూను సొంతం చేసుకున్నారు. జిల్లాలో బాలాపూర్ వినాయకుడి లడ్డూ వేలం తర్వాత ఆదిభట్ల వినాయకుడి లడ్డూ వేలం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేలం అనంతరం నిర్వాహకులు, స్థానికులు మర్రి నిరంజన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మర్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. గణనాథుడి ఆశీస్సులతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ అష్టైశ్వర్యాలు కలగాలని, నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. గణపతి బప్పా మోరియా అంటూ భక్తులు నినాదాలు చేశారు.



# ప్రజల వద్దకే వైద్య సేవలు : మంత్రి సత్యకుమార్ యాదవ్



అనంతపురం, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : ప్రజల వద్దకే వైద్య సేవలను తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నిధులు రూ.75 లక్షలతో నిర్మించిన రోగుల సహాయకుల విశ్రాంతి భవనాన్ని శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెండింగ్ పనులను పూర్తి చేసి ఆసుపత్రి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామన్నారు. అనంతపురంలో క్యాన్సర్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 'సంజీవిని' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో 42 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 933 ఆరోగ్య రథాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి, కలెక్టర్ ఓ.ఆనంద్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 10% వృద్ధి సాధ్యమే: టెక్నాలజీపై నిర్మలా సీతారామన్

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు**

**ఏఐ, సెమీకండక్టర్లకు భారీగా నిధులు కేటాయించాలని సూచన**

**చిన్న పరిశ్రమల్లోనూ ఏఐ వాడకం పెరగాలని వ్యాఖ్య**

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు. దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా



సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.



## మహిళా ఉద్యోగుల వేధింపుల ఆరోపణలపై విచారణ జరపాలి

ధర్మవరం, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : శ్రీ సత్యసాయి జిల్లా బీసీ సంక్షేమ శాఖ హాస్టల్ విభాగంలో మహిళా ఉద్యోగులపై వేధింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ధర్మవరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోతలయ్య మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ డీడీ రాజేంద్రకుమార్‌రెడ్డిపై కొందరు మహిళా ఉద్యోగులు మానసికంగా, అసభ్యకరంగా వేధిస్తున్నారంటూ ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కొందరికి షోకాజ్ నోటీసులు, మెమోలు జారీ చేయడం, విధుల్లో ఇబ్బందులకు గురిచేయడంతో పాటు వాట్సాప్ గ్రూపుల్లో అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఆరోపణలు విచారణలో రుజువైతే సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ధర్మవరం చెరువుకు మహర్దశ

**రూ.100-150 కోట్లతోలి లేక్‌ఫ్రంట్ అభివృద్ధి**

**కేంద్ర నిధుల కోసం ప్రయత్నం: మంత్రి సత్యకుమార్**

ధర్మవరం, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం చెరువును ఆక్రమణలు, మురుగునీటి నుంచి కాపాడుతూ ఆధునిక హంగులతో లేక్‌ఫ్రంట్‌గా అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి, ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఎస్పీఏ విజయవాడ బృందంతో నిర్వహించిన సమీక్షలో అభివృద్ధి ప్రణాళికపై చర్చించారు. చెరువు చుట్టూ 16 కి.మీ. మేర వాక్‌వే, జాగింగ్, సైకిల్ ట్రాక్‌లు, పచ్చదనం, లైటింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. పట్టణానికి ఆనుకుని ఉన్న 3.5 కి.మీ. ప్రాంతాన్ని తొలిదశలో అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఏడు ప్రాంతాలను ప్రత్యేక థీమ్‌లతో అభివృద్ధి చేసి బోటింగ్, పార్కులు, యాంఫిథియేటర్, ఫుడ్ స్టాల్స్ వంటి సౌకర్యాలు కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ధర్మవరం చేనేత, స్థానిక కళలు, చారిత్రక వారసత్వానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. డీపీఆర్ పూర్తయ్యాక కేంద్ర 'అర్బన్ ఛాలెంజ్' ద్వారా నిధులు సాధించేందుకు ప్రయత్నిస్తామని, ప్రాజెక్టు వ్యయం రూ.100--150 కోట్ల వరకు ఉండవచ్చని పేర్కొన్నారు. సమీక్షలో ఆర్డీఓ రాంభూపాల్‌రెడ్డి, ఎస్పీఏ ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వందేళ్ల కళాజ్యోతి.. ధర్మవరం గర్వకేతనం

ధర్మవరం, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం కళా, సాంస్కృతిక రంగానికి 'కళాజ్యోతి' శతాబ్ద కాలంగా సేవలందించడం గర్వకారణమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. శత వార్షికోత్సవ వేడుకల్లో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. 1926లో చిన్న రీడింగ్ రూమ్‌గా ప్రారంభమైన సంస్థ అనంతరం గ్రంథాలయంగా అభివృద్ధి చెంది సాహిత్యం, కళలు, సంగీతం, నాటకం, నృత్యం, క్రీడలకు వేదికగా నిలిచిందని మంత్రి తెలిపారు. 1973లో 'కళాజ్యోతి' సంస్థ ఏర్పడి కళా కార్యక్రమాలకు వేదికగా సేవలందించిందన్నారు. రామకృష్ణమాచార్యుల వర్ధంతి, ఘంటసాల జయంతి, వర్ధంతి, సురభి నాటక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలకు సంస్థ వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. వందేళ్ల ప్రస్థానంలో సంస్థ అభివృద్ధికి కృషి చేసిన పాలకవర్గాలు, సభ్యులు, కళాకారులు, సాహితీవేత్తలను మంత్రి అభినందించారు.



## గర్భిణులకు సీమంతం.. అంగన్ కా ఉత్సవ్

ధర్మవరం, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణం 28వ వార్డులో 'అంగన్ కా ఉత్సవ్' కార్యక్రమాన్ని బీజేపీ వార్డు ఇన్‌చార్జి, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు మహేష్ ప్రజాపతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించి చీరలు, పూలు, పండ్లు పంపిణీ చేశారు. అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలను శాలువాలతో సత్కరించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జింక ప్రవీణ్, మైనార్టీ ఉపాధ్యక్షుడు అమీర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా గుడి రోడ్డు డ్రైనేజీ నిర్మాణానికి మోక్షం లేదా ఇంకెన్నాళ్లు ఇంకెన్నిళ్లు

## స్థానికులు సిపిఐ నేతలతో కలిసి నిరసన ఆందోళన

### పాల్గొన్న సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్థానిక 33 వ వార్డు కౌన్సిలర్ బి అజయ్ సారధి రెడ్డి

అరుణప్రభ 26 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : స్థానికులు సిపిఐ నేతలతో కలిసి సిపిఐ 33 వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక 33 వార్డ్ కౌన్సిలర్ సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి నాయకత్వంలో ఈరోజు సాయిబాబా గుడి రోడ్ లో నిరసన ఆందోళన చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ సుమారు నాలుగు సంవత్సరాలుగా సాయిబాబా గుడి రోడ్ లో సాయిబాబా గుడి వైపున రోడ్డు డ్రైనేజీ నిర్మించకపోవడంతో ఆ ప్రాంతంలో ఉన్న ఇంటి యజమానులు వ్యాపార యజమానులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని కొందరు ఆ ప్రాంతంలో ఉండలేక వేరే ప్రాంతంలో కిరాయికి ఉంటున్నారని అంతే కాకుండా సాయిబాబా దేవాలయానికి వచ్చే భక్తులు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యంగా ఈ రోడ్డు మార్గం గుండా పత్తిపాక వైపు ఉన్న వివిధ కాలనీలు తండాలు వివిధ గ్రామాల నుండి అనునిత్యం మైబాద్ జిల్లా కేంద్రానికి వచ్చేటువంటి వాహనదారులు ప్రయాణికులు ప్రజలు పాదాచారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు మరియు నూతన మున్సిపల్ పాలకమండలి తో పాటు ముఖ్య ప్రజా ప్రతినిధులు సైతం గా పరిష్కారం చూపకుండా తీవ్ర కాలయాపన అవుతున్న ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు శ్రీ సాయిబాబా గుడి రోడ్డు మొత్తం మురుగునీరు చెట్లు చెత్తాచెదారం అంతేకాకుండా పార్కింగ్ ప్లేస్ గా మారిపోయిందని ఇకనైనా సాయిబాబా గుడి రోడ్ లో నిలిచిపోయిన రోడ్డు మరియు డ్రైనేజీ నిర్మాణాలను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు ఈ నిరసన ఆందోళనలో స్థానికులు మితింటి ఉపేందర్ యాదవ్ ధనుంజయ్ సిపిఐ నాయకులు నర్రా శ్రావణ్ కట్లోజు



పాండురంగాచారి కేదాస రమేష్ భానోత్ లింగయ్య నాయక్ పడిదల కవిత నీలం వెంకటేశ్వర్లు గాదం శ్యాం ప్రసాద్ యూసుఫ్ మంద శంకర్ తండా శ్రీనాథ్ వెంకట్రాం నర్సయ్య గుండోజు రమేష్ తదితరులు పాల్గొన్నారు

# పోలీసు సేవలు సులభతరంగా 'మీ పోలీస్.. మీ ఫ్రెండ్' డిజిటల్ ఈ-ఫిర్యాదుల కియాస్క్..

### రైల్వే స్టేషన్ లో ప్రారంభించిన రాష్ట్ర హోం శాఖ మంత్రి



విశాఖపట్నం, అరుణ ప్రభ , సెప్టెంబర్ 26: : పౌరులకు పోలీస్ సేవలను మరింత సులభతరం, పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 'మీ పోలీస్.. మీ ఫ్రెండ్' డిజిటల్ ఈ-ఫిర్యాదుల కియాస్క్‌ను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శనివారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ విశాఖ రైల్వే స్టేషన్ నుంచి రోజుకు సుమారు 1.5 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ ప్రయాణికులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా రైల్వే స్టేషన్‌లోనే కియాస్క్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. ఈ కియాస్క్ ద్వారా తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో వాయిస్ ద్వారా ఫిర్యాదు చేసే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ-ఫిర్యాదుల కియాస్క్‌ను 'పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ)'కు అనుసంధానం చేయడం ద్వారా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారంలో పారదర్శకత, కచ్చితత్వం ఉంటుందన్నారు. ప్రస్తుతం నేరాల స్వభావం మారుతున్న నేపథ్యంలో ఏపీ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కేసులను ఛేదిస్తున్నారని హోంమంత్రి ప్రశంసించారు. మహిళల భద్రత విషయంలో విశాఖ ముందంజలో ఉందన్నారు. సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ విశాఖలో రైల్వే స్టేషన్‌తో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కూడా ఈ-ఫిర్యాదుల కియాస్క్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ప్రజలు కియాస్క్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. చదువు రాని వారు సైతం సులభంగా ఫిర్యాదు చేసేలా వాయిస్ ఆధారిత సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు, రైల్వే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఈఎంఐ పద్ధతిలో లంచం.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మహిళా సీడీపీవో

**జగిత్యాల జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీడీపీవో**

**అంగన్వాడీ సూపర్‌వైజర్ల నుంచి నెలవారీ వసూళ్లు**

**నెలకు ఒక్కొక్కరి నుంచి రూ.1000 చొప్పున ఒప్పందం**

**మూడు నెలలకు కలిపి రూ.63,000 తీసుకుంటుండగా ఏసీబీ దాడి**

**అధికారిణి దారోజు పద్మను అదుపులోకి తీసుకున్న అధికారులు**



లంచాన్ని నెలవారీ వాయిదాల రూపంలో వసూలు చేస్తున్న ఓ ప్రభుత్వ అధికారిణి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ ఘటన తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో చోటుచేసుకుంది. మెట్‌పల్లి చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీవో)గా పనిచేస్తున్న దారోజు పద్మ, తన పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తుంటారు. అయితే, ఈ తనిఖీల్లో ప్రతికూల నివేదికలు ఇవ్వకుండా ఉండేందుకు గాను, ఆమె పరిధిలోని 21 మంది అంగన్వాడీ సూపర్‌వైజర్ల నుంచి నెలవారీ మామూళ్లు డిమాండ్ చేశారు. దీని ప్రకారం, ఒక్కో సూపర్‌వైజర్ నెలకు రూ. 1000 చొప్పున ఆమెకు లంచంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో, మూడు నెలలకు సంబంధించిన మొత్తాన్ని ఆమె ఏకమొత్తంగా వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. 21 మంది నుంచి రూ.63,000 లంచం తీసుకుంటుండగా, పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు వలపన్ని ఆమెను పట్టుకున్నారు. లంచం తీసుకుంటున్న సమయంలో పద్మను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఒక ప్రభుత్వ అధికారిణి ఇలా నెలవారీ పద్ధతిలో లంచం వసూలు చేయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# అహం వీడితే ఆనందం

కోపం తాపం వద్దు
పగలు పట్టింపుల
పద్దులు వద్దు
కుట్రలు కుయుక్తుల
కుళ్ళు వద్దు
సంతృప్తి మన
సంపద కావాలి
సంతోషమే మన
భూషణం కావాలి
సద్గుణం సహనమే
మన సౌభాగ్యం
కావాలి
అహం వీడితే
ఆనందం
అలుకలు
మానితె అహల్లాధం
ఆందోళనలు వద్దు
ఆనందమే ముద్దు
పరోపకారమే మన
జీవనశైలైతే
పగలు సెగలు
అంతరించి
ప్రగతి
పురోగతి
పరుగెడుతుంది
ఆత్మీయతే
పరమానందం
అక్కున చేర్చుకునే
మనసే మన ఆస్తి
కావాలి
ఆస్తుల అంతస్తుల
అధికార హోదాల
దర్పణం వద్దు
డబ్బు జబ్బు
మబ్బులు వద్దు
ఆర్తత
ఆప్యాయత
ఆత్మీయతే ముద్దు
కలిమిడి తనమే
నీ జీవనవిధానం
కావాలి
పరోపకారం
ప్రగతిశీలతే ముద్దు

మన బాట కావాలి
అహం ఆవేశం
వీడితే ఆలోచన
వివేకం విజ్ఞానం
నీ సొంతమోతుంది
మమత
మానవీయత
పరిమళిస్తే
మనశ్శాంతి
నీ వశమౌతుంది
ఒంటరి జీవితం
వద్దు సమిష్టి తత్వం
సామాజిక జీవనమే
నీ హద్దు కావాలి
త్యాగాలతో పోటీపడు
మంచిని పెంచి
మంచిని పంచే
మనసున్న
మనిషిగా
నిలిచిపో
త్యాగాల
పునాదుల
మీద చరిత్ర
నిర్మాతగా
నిలిచిపో
ప్రభావ శీల
వ్యక్తిత్వంతో
సమాజ మార్పుకై
ఆదర్శంగా నిలిచిపో
జనహితమే నీ
అభిమతమైతె
జనహృదయాలలో
గూడు కట్టుకొన్న
దేవుడైతావు
సహకారం
సంఘీభావం
సహనం నీతోడు
నీడ కావాలి
మనసున్న మనిషిగా
ఎదుగు
బాధ్యతలు
భాధలు
భరోసాతోనే

బంధాలు
బంధుత్వాలు
నిలుస్తాయి
కష్టాలు కలిమి
లేములు కావడి
కుండలు
కష్టాలకు కుంగక
సమస్యలకు బెదరక
పొగడ్తలకు పొంగక
ఆత్మవిశ్వాసమే
ఆయుధంగా
జీవిత లక్ష్య
సాధనలో
విజయుడిగా
నిలవాలి
ఆత్మగౌరవంతో
ఆదర్శంగా బతకాలి
మనోధైర్యంతో మానవ
వికాసంలో మార్గదర్శిగా
నిలవాలి
చీకటిని తొలగించే
చిరు ధీపమై వెలగాలి

**- నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు**
**తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక**
**కరీంనగర్**
**9440245771**





## 'అంగన్ కా ఉత్సవ్'లో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు సన్మానం

బత్తలపల్లి, సెప్టెంబరు 26; (అరుణ ప్రభ న్యూస్) : బత్తలపల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన 'అంగన్ కా ఉత్సవ్' కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. జెడ్పీటీసీ, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి కోటి సుధా హాజరయ్యారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆశా కార్యకర్తలను శాలువాలతో సన్మానించి వారి సేవలను అభినందించారు. సేవా సంకల్ప అభియాన్ ద్వారా వారి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు గౌరవించడమే లక్ష్యమని పేర్కొన్నారు.



## గాయపడిన బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

విశాఖపట్నం: అరుణ ప్రభవిశాఖ దక్షిణ నియోజకవర్గం 37వ వార్డు కొత్త అగ్రహారం కాలనీలో జరిగిన ఘటనలో గాయపడిన గణగాళ్ల దివ్య, గణగాళ్ల కనకమహాలక్ష్మి, గణగాళ్ల యల్లమ్మలను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు. చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లిన ఎమ్మెల్యే బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఎలాంటి ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## డిసెంబర్ 13న విశాఖలో నేవీ మారథాన్-2026

### పోస్టర్ ఆవిష్కరించి రిజిస్ట్రేషన్లు ప్రారంభించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, అరుణ ప్రభ సెప్టెంబర్ 26: విశాఖలో డిసెంబర్ 13న 11వ ఎడిషన్ నేవీ మారథాన్--2026 నిర్వహించడం ఆనందంగా ఉందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. శనివారం డాల్ఫిన్ హోటల్‌లో నేవీ డిఫెన్స్ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మారథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించి, రిజిస్ట్రేషన్లను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేతన్ గార్గ్ మాట్లాడుతూ విశాఖ నేవీ మారథాన్‌కు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. నగర వికాసంతో పాటు విశాఖకు మరింత ప్రాచుర్యం తీసుకురావడంలో మారథాన్ దోహదపడుతుందని తెలిపారు. గత ఏడాది సుమారు 17 వేల మంది పాల్గొనగా, ఈసారి 20 వేల మందికి పైగా పాల్గొనే అవకాశం ఉందన్నారు. మారథాన్ నిర్వహణకు జీవీఎంసీ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. నేవీ మారథాన్‌ను 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్, 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, 10కే, 5కే విభాగాల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాలుగు విభాగాలకు విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభ ప్రదేశంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 25 వరకు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం ఉందన్నారు. పాల్గొనే వారికి మెడల్, టీషర్ట్‌తో పాటు విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేవీ డిఫెన్స్ అధికారులు పాల్గొన్నారు.ద

## హైదరాబాద్ జీపీఓ స్థాయిని తగ్గించొద్దు..

### ::: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ఒవైసీ లేఖ

హైదరాబాద్ నగరానికి చారిత్రక వారసత్వంగా ఉన్న హైదరాబాద్ జనరల్ పోస్టాఫీస్ (జీపీఓ) హోదాను తగ్గించాలన్న ప్రతిపాదనను తాము వ్యతిరేకిస్తున్నట్లు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఈ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలకు ఆయన శనివారం లేఖ రాశారు. హైదరాబాద్ జీపీఓను గ్రూప్ 'ఏ' నుంచి గ్రూప్ 'బీ'కి మార్చడంతో పాటు, హైదరాబాద్ సిటీ డివిజన్‌లో విలీనం చేయాలని ఇటీవల వచ్చిన ప్రతిపాదన సరికాదంటూ ఒవైసీ తన లేఖలో ప్రస్తావించారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఈ సంస్థ హోదాను తగ్గించడం అన్యాయమని, ఏకపక్ష నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. జీపీఓ ఉద్యోగుల నుంచి తనకు అందిన వినతిపత్రాన్ని కూడా ఈ లేఖకు జతపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జీపీఓ ప్రాముఖ్యతను ఒవైసీ వివరించారు. "హైదరాబాద్ జీపీఓ అత్యధిక పనిభారం కలిగిన ముఖ్యమైన సంస్థ. హైదరాబాద్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలోని మొత్తం మెయిల్ కార్యకలాపాల్లో జీపీఓ వాటా గణనీయంగా ఉంది. దీని డెలివరీ పరిధి కూడా నిరంతరం విస్తరిస్తోంది. అంతేకాకుండా, తెలంగాణ రాష్ట్రంలో ఏకైక ఫిలాటెలిక్ బ్యూరో (తపాలా స్టాంపుల సేకరణ, పోస్టల్ చరిత్ర పరిశోధన) ఇక్కడే ఉంది" అని ఆయన పేర్కొన్నారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఈ చారిత్రక సంస్థకు మహానగరంలో ఎంతో ప్రాధాన్యత ఉందని, లక్షలాది మందికి తపాలా సేవలు అందిస్తోందని ఒవైసీ గుర్తుచేశారు.

# చెరువుల్లో భూ కబ్జాలు.. తగ్గుతున్న జలాశయాల విస్తీర్ణం

**అడుగంటుతున్న భూగర్భ జలాలు.. భవిష్యత్తుపై ఆందోళన**

**శిఖం పట్టాల పేరుతో యథేచ్ఛగా సాగు.. చెరువు భూముల్లో నిర్మాణాలు**

**రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ ఏదని ప్రశ్నిస్తున్న రైతులు**

**ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను గుర్తించి కబ్జాలను తొలగించాలని డిమాండ్**

**హైడ్రా తరహా ప్రత్యేక సర్వేతో చెరువుల హద్దులు తేల్చాలని రైతు సంఘాల విజ్ఞప్తి**





ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి : ఎల్లారెడ్డిపేట మండలంలో నీటి వనరులకు ప్రధాన ఆధారాలుగా ఉన్న చెరువులు క్రమంగా కబ్జాలకు గురవుతూ విస్తీర్ణాన్ని కోల్పోతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకప్పుడు వర్షాకాలంలో నీటితో కళకళలాడిన అనేక చెరువులు ప్రస్తుతం ఆక్రమణలు, పూడిక, శిఖం భూముల్లో సాగు, నిర్మాణాల కారణంగా క్రమంగా చిన్నవవుతున్నాయని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల అసలు విస్తీర్ణం ఎంత? ప్రస్తుతం ఎంత మేరకు మిగిలింది? ఎంత భూమి ఆక్రమణకు గురైంది? అనే విషయాలపై సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

**నీటి నిల్వలు తగ్గుతున్నాయా?**

చెరువుల విస్తీర్ణం తగ్గడంతో వర్షాకాలంలో వచ్చే నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే పరిస్థితి లేకుండా పోతోందని రైతులు చెబుతున్నారు. ఏడాది పొడవునా నీటి నిల్వలు ఉండాల్సిన కొన్ని చెరువులు కొద్ది కాలానికే ఎండిపోతున్నాయని, ఫలితంగా ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొంటున్నారు. చెరువుల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటడం పరస్పరం అనుసంధానమైన సమస్యలని రైతులు అంటున్నారు. చెరువులు నిండితే భూగర్భ జలాలు రీచార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని, చెరువుల విస్తీర్ణం తగ్గి నీటి నిల్వ సామర్థ్యం పడిపోతే బోర్లు, బావులపై కూడా ప్రభావం పడుతుందని చెబుతున్నారు.

**బోర్లలో నీళ్లు రాక.. సాగుపై ప్రభావం**

ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో బోర్లలో ఆశించిన స్థాయిలో నీరు రావడం లేదని రైతులు వాపోతున్నారు. సాగుకు అవసరమైన నీరు అందక పంటల సాగు కూడా ఇబ్బందికరంగా మారుతోందని చెబుతున్నారు. వర్షాధార వ్యవసాయంపై ఆధారపడాల్సిన పరిస్థితులు పెరిగితే భవిష్యత్తులో రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి వనరుల పరిరక్షణను కేవలం ప్రస్తుత సమస్యగా కాకుండా భవిష్యత్ తరాల నీటి భద్రతకు సంబంధించిన అంశంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

**శిఖం పట్టాల పేరుతో సాగు?**

చెరువుల శిఖం భూముల విషయంలో స్పష్టమైన హద్దులు లేకపోవడం, రికార్డులపై అవగాహన లేకపోవడం లేదా పర్యవేక్షణ లోపించడం వల్ల కొన్ని చోట్ల శిఖం భూములను సాగు భూములుగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువు భూముల్లో పంటలు సాగు చేయడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గడమే కాకుండా భవిష్యత్తులో ఆక్రమణలకు మార్గం సుగమమయ్యే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

**చెరువు భూముల్లో నిర్మాణాలపై ఆందోళన**

కొన్ని ప్రాంతాల్లో చెరువు పరిధిలోని భూముల్లో నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. నీటి వనరులకు సంబంధించిన భూముల్లో నిర్మాణాలు జరిగితే వర్షపు నీటి సహజ ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో పాటు చెరువు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇలాంటి నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి అధికారులు అడ్డుకోవాలని, ఇప్పటికే జరిగిన ఆక్రమణలు, నిర్మాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. చెరువులు, కుంటలు, శిఖం భూముల పరిరక్షణకు రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు బాధ్యత వహించాల్సి ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కనిపించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గాలు కూడా తమ పరిధిలోని నీటి వనరుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. చెరువు భూములు క్రమంగా ఆక్రమణలకు గురైన తర్వాత వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవడం కష్టతరమవుతుందని, కాబట్టి ముందుగానే సర్వేలు నిర్వహించి హద్దులను నిర్ధారించాల్సిన అవసరం ఉందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

**గిద్ద చెరువు.. జక్కుల చెరువుపై ప్రత్యేక దృష్టి**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్ద చెరువు, రాచర్ల బొప్పాపూర్‌లోని జక్కుల చెరువు, గొల్లపల్లి పరిధిలోని చెరువులు గతంతో పోలిస్తే చిన్నవవుతున్నాయనే అభిప్రాయాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ఆయా చెరువుల అసలు విస్తీర్ణం, ప్రస్తుత విస్తీర్ణం, శిఖం భూములు, ఎఫ్‌టీఎల్ పరిధి, బఫర్ జోన్ తదితర అంశాలపై అధికారికంగా సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రత్యేకంగా ఈ చెరువులపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించి, రికార్డుల ఆధారంగా హద్దులను నిర్ణయించి, అవసరమైన చోట సరిహద్దు గుర్తులు ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**సమగ్ర సర్వే చేయాలి**

జిల్లాలోని అన్ని ప్రధాన చెరువులు, కుంటలు, నీటి వనరులపై ఒకేసారి సమగ్ర సర్వే నిర్వహించాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. చెరువుల అసలు విస్తీర్ణం ఎంత, ప్రస్తుతం ఎంత ఉంది, ఎఫ్‌టీఎల్ పరిధి ఎక్కడి వరకు ఉంది, బఫర్ జోన్ ఎంత, ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయి, ఎక్కడ నిర్మాణాలు వెలిశాయి అనే అంశాలను సాంకేతికంగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. హైడ్రా తరహా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ, జిల్లా స్థాయి అధికార యంత్రాంగం సమన్వయంతో చెరువులపై సర్వే నిర్వహిస్తే వాస్తవ పరిస్థితి వెలుగులోకి వస్తుందని వారు పేర్కొంటున్నారు.

**ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను రక్షించాలి**

చెరువుల ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్), బఫర్ జోన్ పరిధులను స్పష్టంగా గుర్తించి ప్రజలకు కనిపించేలా హద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. హద్దులు స్పష్టంగా ఉంటే భవిష్యత్తులో కొత్త ఆక్రమణలకు అడ్డుకట్ట వేయవచ్చని అంటున్నారు. ఇప్పటికే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఆక్రమణలు ఉన్నట్లయితే వాటిని నిబంధనల ప్రకారం గుర్తించి తొలగించాలని, చెరువుల సహజ నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

**భవిష్యత్తులో కరువు ముప్పు?**

చెరువులు క్రమంగా కుంచించుకుపోతే దాని ప్రభావం కేవలం సాగునీటిపైనే కాకుండా తాగునీటిపైనా పడే ప్రమాదం ఉందని పరిశీలకులు చెబుతున్నారు. నీటి వనరులను ఇప్పుడే పరిరక్షించకపోతే భవిష్యత్తులో భూగర్భ జలాలు మరింత తగ్గి, బోర్లు విఫలమై, సాగు విస్తీర్ణం తగ్గే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉన్న చెరువులే కరువు సమయంలో గ్రామాలకు రక్షణగా నిలుస్తాయని, అందువల్ల చెరువుల పరిరక్షణను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాల్సిన అవసరం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

**కబ్జాదారుల నుంచి చెరువులను కాపాడాలి**

ఎల్లారెడ్డిపేట మండలంలోని అన్ని చెరువులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమగ్ర సర్వే నిర్వహించి, ఆక్రమణలు ఉన్నట్లయితే గుర్తించి నిబంధనల ప్రకారం తొలగించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. చెరువుల హద్దులను శాశ్వతంగా గుర్తించి, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

"చెరువులు కాపాడితేనే నీరు.. నీరు కాపాడితేనే వ్యవసాయం.. వ్యవసాయం నిలిస్తేనే గ్రామీణ జీవనం" అనే వాస్తవాన్ని అధికారులు గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో మండలంలోని గిద్ద చెరువు, జక్కుల చెరువు, గొల్లపల్లి చెరువులతో పాటు అన్ని నీటి వనరులపై సమగ్ర సర్వే నిర్వహించి, వాటి అసలు హద్దులను పునర్నిర్ధారించి, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రపంచంలో ఆరో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా ఎన్ఎస్ఈ

**రూ.4.5 లక్షల కోట్లకు చేరిన మార్కెట్ విలువ.. భారీ లిస్టింగ్‌తో కొత్త రికార్డు**




ముంబయి, సెప్టెంబర్ 25: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ) మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా ప్రపంచంలోని ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల సరసన నిలిచింది. ఎన్ఎస్ఈ షేర్లు బీఎస్ఈలో లిస్ట్ కావడంతో సంస్థ మార్కెట్ విలువ సుమారు రూ.4.5 లక్షల కోట్లకు చేరినట్లు అందిన సమాచారం ప్రకారం తెలుస్తోంది. దీంతో ప్రపంచంలోని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో మార్కెట్ విలువ పరంగా ఎన్ఎస్ఈ ఆరో స్థానానికి చేరింది. ఎన్ఎస్ఈ షేరుకు ఇష్యూ ధరను రూ.1,785గా నిర్ణయించగా, బీఎస్ఈలో రూ.1,800 వద్ద లిస్టయింది. లిస్టింగ్ అనంతరం కొనుగోళ్ల మద్దతుతో షేరు రూ.1,818 వద్ద ముగిసింది. దీంతో ఎన్ఎస్ఈ మార్కెట్ విలువ గణనీయంగా పెరిగింది. బ్లూమ్‌బెర్గ్ డేటా ప్రకారం అమెరికాకు చెందిన సీఎంఈ గ్రూప్ సుమారు 97.37 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో అగ్రస్థానంలో ఉంది. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ మాతృసంస్థ ఇంటర్‌కాంటినెంటల్ ఎక్స్ఛేంజ్ 87.77 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో ఉంది. హాంకాంగ్ ఎక్స్ఛేంజెస్ అండ్ క్లియరింగ్ 63.40 బిలియన్ డాలర్లు, డ్యూయిష్ బోర్స్ 58.09 బిలియన్ డాలర్లు, నాస్‌డాక్ 53.34 బిలియన్ డాలర్లు, లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ 52.89 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో తర్వాతి స్థానాల్లో ఉన్నట్లు పేర్కొంది. ఎన్ఎస్ఈ మార్కెట్ విలువ సుమారు 46.87 బిలియన్ డాలర్లుగా ఉండటంతో ఆరో స్థానంలో నిలిచినట్లు సమాచారం. సిబో గ్లోబల్ మార్కెట్స్ 28.07 బిలియన్ డాలర్లు, సింగపూర్ ఎక్స్ఛేంజ్ 18.75 బిలియన్ డాలర్లు, యూరోనెక్స్ట్ 18.12 బిలియన్ డాలర్లతో ఎన్ఎస్ఈ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఎన్ఎస్ఈ లిస్టింగ్‌తో భారత స్టాక్ మార్కెట్ రంగానికి మరో కీలక ఘట్టం నమోదైనట్లయింది. భారతీయ మూలధన మార్కెట్‌లో ఎన్ఎస్ఈకి ఉన్న ప్రాధాన్యాన్ని ఈ మార్కెట్ విలువ మరింత స్పష్టం చేస్తోంది.

# ఆదివారం బ్యాంకులు ఓపెన్.. ఎన్ని గంటలు పని చేస్తాయంటే?

**సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల బ్యాంకు సమ్మె**

బ్యాంకు యూనియన్లు సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చాయి. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఈ సమ్మె జరగనుంది. అంతకుముందు సెప్టెంబర్ 11న కూడా ఒక రోజు సమ్మె నిర్వహించారు. ప్రధానంగా వారానికి ఐదు రోజులే బ్యాంకింగ్ సేవలు ఉండాలి, అలాగే పనితీరు ఆధారిత ప్రోత్సాహక పథకంను వెనక్కి తీసుకోవాలనే డిమాండ్లతో యూనియన్లు సమ్మెకు సిద్ధమయ్యాయి. సమ్మెకు ముందు రోజైన సెప్టెంబర్ 27 ఆదివారం బ్యాంకు శాఖలను తెరిచి ఉంచాలని నిర్ణయించారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్యాంకుల్లో సాధారణ పనులు చేసుకోవచ్చని సమాచారం. RBI అనుమతితో బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, చావీలకు సంబంధించిన శాఖలు, కరెన్సీ చెస్ట్‌లు కూడా పనిచేసేలా ఏర్పాట్లు చేశారు. దీంతో సమ్మె ప్రారంభమయ్యే ముందు రోజు ఖాతాదారులు తమకు అవసరమైన బ్యాంకింగ్ పనులను పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది.

# పసిడి ప్రియులకు పండగే.. బంగారం ధరలు తగ్గుముఖం..తెలుగు రాష్ట్రాల్లో ఇవాళ రేట్లు ఇవే



బంగారం ధరలు వరుసగా మార్పులకు లోనవుతున్న వేళ.. శనివారం పసిడి రేట్లు స్వల్పంగా దిగొచ్చాయి. శుక్రవారం పెరిగిన ధరలకు నేడు బ్రేక్ పడింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ.160, 22 క్యారెట్లపై రూ.150 చొప్పున తగ్గింది. దీంతో బంగారం కొనాలని చూస్తున్న వారికి కాస్త ఊరట లభించింది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలను పరిశీలిస్తే.. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం సహా ఇతర ప్రాంతాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,680గా ఉంది. 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములకు రూ.1,39,950 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి విషయానికి వస్తే.. దేశీయ మార్కెట్లో ఎలాంటి మార్పు కనిపించలేదు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో కిలో వెండి ధర రూ.2.50 లక్షల వద్ద స్థిరంగా ఉంది. ఢిల్లీ, ముంబయి, బెంగళూరులో కిలో వెండి రూ.2.45 లక్షలుగా ఉంది. చెన్నైలో కిలో వెండి ధర రూ.2.50 లక్షల వద్ద కొనసాగుతోంది. అయితే బంగారం ధరల్లో ఈ స్వల్ప తగ్గుదల వెనుక దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ పరిణామాలు కూడా ప్రభావం చూపుతున్నాయి. ఇటీవలి కాలంలో కమోడిటీ మార్కెట్లలో పెట్టుబడిదారుల కదలికలు పెరగడంతో ధరల్లో ఊగిసలాట కనిపిస్తోంది. భారీ కొనుగోళ్లు, అమ్మకాల మధ్య పసిడి రేట్లు ఒకరోజు పెరిగితే మరోరోజు తగ్గుతున్న పరిస్థితి నెలకొంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో మాత్రం బంగారం ధర పెరిగింది. ప్రస్తుతం ఔన్స్ బంగారం సుమారు 4,285 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారంపై ఆసక్తి కొనసాగుతోంది.

# ఆర్‌ఏసీ టికెట్ ఉందా? బెర్త్ వస్తుందని గ్యారంటీ లేదు!

**రైల్వేలో ఖాళీ బెర్త్‌ల కేటాయింపునకు ప్రత్యేక నిబంధనలు**

**ప్రయాణికుల స్థితిని బట్టి బెర్త్ కేటాయించే అవకాశం**




న్యూఢిల్లీ: రైలులో ఆర్‌ఏసీ టికెట్ ఉంటే ప్రయాణం చేసేందుకు అవకాశం ఉన్నప్పటికీ, ప్రయాణం ప్రారంభమైన వెంటనే పూర్తి బెర్త్ లభిస్తుందని మాత్రం హామీ లేదు. ఖాళీ అయ్యే బెర్త్‌లను రైల్వే నిబంధనల ప్రకారం ప్రయాణికులకు కేటాయిస్తారు. దీంతో ఆర్‌ఏసీ ప్రయాణికులు బెర్త్ కోసం తమ వంతు వచ్చే వరకు వేచి ఉండాల్సి ఉంటుంది. రైలులో రిజర్వేషన్ చేసిన కొంతమంది ప్రయాణికులు చివరి నిమిషంలో ప్రయాణం రద్దు చేసుకోవడం, టికెట్ రద్దు చేయకుండానే రైలుకు హాజరు కాకపోవడం వంటి కారణాలతో కొన్ని బెర్త్‌లు ఖాళీగా మిగిలే అవకాశం ఉంటుంది. అలాంటి ఖాళీ బెర్త్‌లను గుర్తించి అర్హులైన ప్రయాణికులకు కేటాయించేందుకు రైల్వే హ్యాండ్‌హెల్డ్ టెర్మినల్ (హెచ్‌హెచ్‌టీ) వ్యవస్థను ఉపయోగిస్తోంది. ఆర్‌ఏసీ అంటే రిజర్వేషన్ ఎగైనెస్ట్ క్యాన్సిలేషన్. ఆర్‌ఏసీ టికెట్ ఉన్న ప్రయాణికుడు రైలులో ప్రయాణించవచ్చు. అయితే సాధారణంగా పూర్తి బెర్త్ బదులు సీటింగ్ సదుపాయం లభిస్తుంది. ప్రయాణికుల రద్దులు, నో-షో కారణంగా బెర్త్‌లు ఖాళీ అయితే వాటిని ఆర్‌ఏసీ ప్రయాణికులకు కేటాయించే అవకాశం ఉంటుంది. అయితే ఆర్‌ఏసీ టికెట్ ఉందనే కారణంతో ప్రతి ప్రయాణికుడికి తప్పనిసరిగా ప్రత్యేక బెర్త్ లభిస్తుందని భావించకూడదు. రైల్వే సిబ్బంది ఉపయోగించే హ్యాండ్‌హెల్డ్ టెర్మినల్ ద్వారా రిజర్వేషన్ వివరాలను పరిశీలిస్తారు. రైలులో ప్రయాణికులు ఎక్కని కారణంగా ఖాళీగా ఉన్న బెర్త్‌లను గుర్తించి, నిబంధనల ప్రకారం వాటిని కేటాయిస్తారు. బెర్త్ కేటాయింపులో ప్రయాణికుల ఆర్‌ఏసీ స్థితి, రిజర్వేషన్ వివరాలు, అందుబాటులో ఉన్న బెర్త్‌లు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అందువల్ల ఆర్‌ఏసీ ప్రయాణికులు ప్రయాణ సమయంలో టికెట్ స్థితిని, బెర్త్ కేటాయింపును గమనిస్తూ ఉండటం మంచిది. ఆర్‌ఏసీ టికెట్‌తో ప్రయాణించే వారికి ప్రయాణ హక్కు ఉన్నప్పటికీ, పూర్తి బెర్త్ ఖాళీగా ఉంటేనే అది కేటాయించే అవకాశం ఉంటుంది. ఖాళీ బెర్త్‌లు లేకపోతే ఆర్‌ఏసీ ప్రయాణికుడు కేటాయించిన సీటులోనే ప్రయాణించాల్సి ఉంటుంది. అందువల్ల "ఆర్‌ఏసీ టికెట్ ఉంది కాబట్టి పూర్తి బెర్త్ ఖాయం" అనే అపోహకు గురికాకుండా, రైల్వే నిబంధనలను తెలుసుకుని ప్రయాణించడం మంచిది.


CORPORATE OFFICE: SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267, HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070. TG. CELL. 9348313999/8885727777.

EDITED, PRINTED, PUBLISHED & OWNED BY GURRAM PAPI REDDY, # H.NO.4-57, THORRUR VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT.501511. TELANGANA. PRINTED AT: GARUDA PRINT-ERS, # H.NO.2-86/1, PLOT NO.23-SP, SYNO.417, SAGAR HIGHWAY, RANGANNAGUDA VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMJAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT.501510. TELANGANA. PUBLISHED AT: # H.NO.4-57, THORRUR VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMJAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT. 501511. TELANGANA....WWW.ARUNAPRABHA.COM.EMAIL.ARUNAPRABHADAILY@GMAIL.COM, RNI NO. TELTEL/2023/89778, CELL NO. 9700127889.